
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
5
ఆదివారం 21 సెప్టెంబరు 2025



ఇసుక అక్రమ రవాణా..
నియంత్రణకు కఠిన చర్యలు : సీపీ

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏపీ నుంచి ఇసుక అక్రమ రవాణా నియంత్రించేందుకు జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగే ఇసుక రవాణాను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల ద్వారా పోలీసు, మైనింగ్ తదితర శాఖల సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని అధికారులను ఆదేశించారు. చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీ నుంచి ఇసుక రవాణ చేసిన వాహనాలపై కేసులు నమోదుచేయడంతో పాటు వాటిని జప్తు చేయాలన్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన 15 చెక్‌పోస్టులలో సిబ్బంది మూడు షిఫ్టులలో 24 గంటలు పనిచేస్తాయని సీపీ తెలిపారు.



అంతా గోప్యంగా!

- భద్రాద్రి దేవస్థానంలో ఏం జరుగుతోంది?
- కీలక విభాగాలను నిర్వీర్యం చేసే ప్రయత్నం
- టెండర్ల రద్దు అందుకోసమేనా అని సందేహాలు
- విధుల్లో చేరేందుకు పలువురి కసరత్తు

భద్రాచలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు అంతర్గత బదిలీలు.. మరోవైపు కీలక విభాగాలను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు.. ఇంకో వైపు ఔట్‌సోర్సింగ్, సెక్యూరిటీ సిబ్బందికి సంబంధించిన టెండర్లను సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ రద్దు.. ఎక్కడా లేని సమస్యలన్నీ ప్రొటోకాల్ విభాగంలోనే వస్తున్నాయట. ఇదీ భద్రాద్రి దేవస్థానంలో జరుగుతున్న తాజా పరిణామాలు. ఇంతకీ దేవస్థానంలో ఏం జరుగుతోంది? అన్న చర్చ మొదలైంది. అంతా గోప్యంగా సాగుతున్న ఈ వ్యవహారాలపై దేవస్థానం వర్గాల్లోనే అంతర్గత చర్చ జరుగుతుండటం గమనార్హం. భద్రాద్రి దేవస్థానానికి నూతన కీలక అధికారి బాధ్యతలు చేపట్టి ఇంకా నెల రోజులు కూడా గడవక ముందే అధికార పార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధుల అనుచరులు చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదు. భద్రాచలం దేవస్థానంలో కొంత కాలంగా (మిగతా 6వ పేజీలో)

తీరొక్క పూల పండుగ వచ్చే..



ప్రకృతిలోని తీరొక్క పూలకు పూజలు.. సంప్రదాయానికి అద్దం పట్టే పాటలు.. మహిళల చేతి గాజుల గలగలలు.. గౌరమ్మా.. గౌరమ్మా.. అంటూ పదం కలిపే అతివల ఆటపాటలతో ప్రతిధ్వనించే బతుకమ్మ పండుగ సంబరాలకు వేళయ్యింది. తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా జరుపుకొనే ఈ వేడుకలు సోమవారం జరిగే ఎంగిలి పూల పండుగతో ప్రారంభం కానున్నాయి. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి గౌరీదేవిని కొలుస్తూ జరుపుకునే ఈ పండుగతో మహిళాలోకం తమ జీవన విధానాన్ని ఆటపాటలతో ప్రపంచానికి చాటుతుంది. తొమ్మిదిరోజుల పాటు తొమ్మిది తీరుల్లో జరిగే బతుకమ్మ సంబురాల కోసం ఉమ్మడి జిల్లా మహిళలు సిద్ధమయ్యారు. ఇప్పటికే మార్కెట్‌లో పూలు, బుట్టలు తదితర సామగ్రి అందుబాటులోకి రావడంతో సందడి వాతావరణం కనిపిస్తోంది.

- ఖమ్మం ఖానాపురం హవేలి / కొత్తగూడెం కల్చరల్, ఆంధ్రజ్యోతి



7

- పల్లెల్లో గౌరమ్మ సంబురాలు షురూ
- రేపటి ఎంగిలి పూల బతుకమ్మతో వేడుకలు మొదలు
- 30న సద్దుల బతుకమ్మతో సమాప్తం
- తొమ్మిది రోజులపాటు వేడుకలు

'పీఎం జుగార్'ను సద్వినియోగం చేసుకోండి

ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసాచారి



అంగన్‌వాడీ కేంద్రంలో మీటర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ శ్రీనివాసాచారి

నేలకొండపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి జుగార్ పథకాన్ని ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసాచారి కోరారు. శనివారం మండల పరిధిలోని తిరుమలాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పీఎం జుగార్ పథకం కింద మంజూరైన కొత్త విద్యుత్ మీటర్‌ను ఎస్ఈ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ మీటర్లు లేని ఎస్సీ, ఎస్టీలు, విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకుంటే, పీఎం జుగార్ పథకం కింద వెంటనే మంజూరు చేస్తామన్నారు. అనంతరం నేలకొండపల్లి ఏఈ కుక్కల రామారావు మాట్లాడుతూ.. పీఎం జుగార్ పథకం కింద మొత్తం ఐదుగురు(మంగాపురంతండాలో 4, తిరుమలాపురం తండా 1) దరఖాస్తు చేసుకుంటే 5 మీటర్లను మంజూరు చేసినట్లు చెప్పారు. అందులో భాగంగానే శనివారం తిరుమలాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీటర్‌ను ఎస్ఈ ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈ నాగేశ్వరరావు, డీఈ కన్‌స్ట్రక్షన్ భద్రుపవార్, ఏడీఈ కోక్యానాయక్, ఏడీఈ కన్‌స్ట్రక్షన్ కిరణ్‌చక్రవర్తి, ఏఈ, నేలకొండపల్లి రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఎంబీఏ తదితర చదువుల అనంతరం అమెరికా వెళ్లి.. ఉన్నత విద్య చదివి.. అక్కడే ఉద్యోగాలు చేసుకుంటూ స్థిరపడాలనుకుంటున్న వారి ఆశలు కూలిపోతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ దేశ పగ్గాలు చేపట్టిన తర్వాత తమ దేశంలో ఉంటున్న ఇతర దేశస్థులు.. ముఖ్యంగా భారతీయుల విషయంలో ఆయన అనేక ఆంక్షలు పెడుతుండటం కలవరపెడుతోంది. దీంతో ఇప్పటికే అమెరికా చదువులపై ఈఏడాది విద్యార్థుల్లో మోజుతగ్గినట్టు తెలుస్తోంది. తాజాగా శనివారం ట్రంప్ హెచ్1బీ వీసాలపై పెట్టిన ఆంక్షలతో జిల్లాలోని ఎన్ఆర్‌లు, ఎంఎస్ చదువుకోసం వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రుల్లో అలజడి మొదలైంది. హెచ్1బీ వీసాలకు రూ.లక్ష డాలర్లు చెల్లించాలని కంపెనీలపై ట్రంప్ ఆంక్షలు పెట్టడం అందరినీ షాక్‌కు గురిచేసింది.

ట్రంప్ ఆంక్షలు కూలుతున్న ఆశలు!

- అమెరికా చదువులు, ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం
- ఉమ్మడి జిల్లా ఎన్ఆర్ఐలలో కలకలం
- 'హెచ్1బీ'పై పెట్టిన నిబంధనలతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గుబులు

ఖమ్మం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఉమ్మడి జిల్లానుంచి సుమారు మూడు దశాబ్దాల కాలంగా అనేక మంది విద్యార్థులు ఎఫ్1వీసాతో అమెరికా యూనివర్సిటీల్లో ఎంఎస్ లాంటి చదువులు చదివి ఐటీ రంగంతోపాటు ఇతర రంగాల్లో ప్రావీణ్యం సంపాదించి ఓపీటీ, స్టెమ్ ఓపీటీల అనంతరం అమెరికా కంపెనీల్లో ఉద్యోగాలుసాధించారు. ఆతర్వాత హెచ్1బీ వీసాలు కూడా పొందారు. కొందరు గ్రీన్‌కార్డును సొంతం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు పదివేల మంది వరకు విద్యార్థులు, ఎన్ఆర్ఐలు అమెరికాలో ఉన్నారు. అక్కడ ఐటీతో పాటు మెడికల్ తదితర కంపెనీలలో ఉద్యోగాలు పొంది ఆర్థికంగా స్థిరపడ్డారు. ఇళ్లు కొని పిల్లలను కూడా యూఎస్‌లోనే చదివించుకుంటున్నారు. కొందరికి గ్రీన్‌కార్డులు రాగా ఎక్కువమంది దరఖాస్తుదారులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో హెచ్1బీ వీసాకు ప్రతిఏటా సుమారు రూ.90లక్షల వరకు చెల్లించాలని కంపెనీలకు నిబంధనలు విధిస్తూ ట్రంప్ తీసుకొచ్చిన ఆంక్షలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. విదేశాల నుంచి వచ్చే నిపుణులకు కూడా ఆ కంపెనీలే చెల్లించాలని చెప్పడంతో అమెరికాలోని మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్, యాపిల్‌తోపాటు అనేక అంతర్జాతీయ ఐటీ కంపెనీలు షాక్‌కు గురయ్యాయి. అమెరికాను వీడి ఎవరు వెళ్లవద్దని, ఎవరైనా విదేశాలకు వెళ్లి ఉంటే వెంటనే స్వదేశానికి రావాలని, ఆదేశాలు ఇవ్వడంతో కొందరు విమానాశ్రయం నుంచి వెనుదిరిగి వెళ్లిన పరిస్థితి నెలకొంది.

ఉమ్మడి జిల్లాపైనా ప్రభావం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేకమంది యువతీ యువకులు అమెరికాలో ఉన్నత చదువులకు వెళ్లారు. మరికొందరు హెచ్1బీ వీసామీద కొన్ని ఐటీ కంపెనీలతో పాటు కొన్ని కాంట్రాక్టు కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. హెచ్1బీవీసా అనుమతికి, రెన్యువల్‌కు ఏటా రూ.లక్షడాలర్లు చెల్లించాలని ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు శాపంగా మారుతున్నాయి. జిల్లాలో అనేక మంది వ్యవసాయ కుటుంబాల నుంచి మధ్యతరగతి వర్గాల పిల్లలు, ఉన్నత వర్గాల పిల్లలు, కార్మికులు, వ్యవసాయ కూలీల పిల్లలు కూడా కష్టపడి చదివి బ్యాంకు రుణాలు తీసుకుని అమెరికా వెళ్లారు. ఇంజనీరింగ్ అనంతరం జీఆర్ఈ, టోఫెల్ లాంటి పరీక్షలు రాసి ఎఫ్1 స్టూడెంట్ వీసా పొంది బ్యాంకుల నుంచి సుమారు రూ.30నుంచి రూ.80లక్షల వరకు రుణాలు తీసుకుని అమెరికా చదువుకోసం ఆర్థిక భారమైనా భవిష్యత్ (మిగతా 6వ పేజీలో)

విస్తారంగా వాన



ఖమ్మం అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు విస్తారంగా వర్షం పడింది. ఖమ్మం, మధిర, సత్తుపల్లి తదితర ప్రాంతాల్లో పడిన మోస్తరు నుంచి భారీ వర్షానికి జనం కొంత అసౌకర్యానికి గురయ్యారు. ఈదురు గాలులు కూడా రావడంతో పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడి రాకపోకలకు స్వల్ప అంతరాయం కలిగింది. భారీ వరద కారణంగా మురుగు కాల్వలు పొంగి పలు కూడళ్లలో నిలిచింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా నిలిచింది. అయితే పగలంతా తీవ్ర ఎండ, ఉక్కపోతగా ఉండి సాయంత్రానికి ఒక్కసారిగా చల్లబడి.. వర్షం కురిసింది. ఇదిలా ఉంటే ఈ వర్షం కొన్ని పంటలకు మేలు కాగా.. పత్తి తదితర పంటలకు నష్టం కలిగే అవకాశం ఉంది.


చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

- రూ. 20 లక్షల విలువచేసే బంగారం స్వాధీనం
- నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

7

'ఓపెన్' కాపీయింగ్‌కు సర్వం సిద్ధం!

- ఇష్టానుసారంగా ఇన్విజిలేటర్ల నియామకం
- అనుకూలంగా ఉన్న వారికే విధులు
- విద్యాశాఖ కార్యాలయంలో అధికారులే సూత్రధారులు
- రేపటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు



(ఫైల్)

ఖమ్మం ఖానాపురంహవేలీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ పరీక్షలు వచ్చాయంటే కొందరు విద్యాశాఖ అధికారులకు, ఇన్విజిలేటర్లకు కాసుల పండగే. కొంతమంది సిబ్బందిని ప్రత్యేకంగా నియమించుకుని పరీక్షలకు హజరుకానున్న వారి నుంచి పాస్ చేయిస్తామంటూ వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏటా జరుగుతున్న మాదిరిగానే ఈ ఏడాది కూడా ఓపెన్ స్కూల్‌లో కాపీ యింగ్‌కు విద్యాశాఖ కార్యాలయంలోని అధికారుల సహాయ సహకారాలతో కాపీయింగ్‌కు పాల్పడేందుకు సహకరిస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. మాస్ కాపీయింగ్‌కు ప్రధాన వనరైన ఇన్విజిలేటర్ల నియామకంతోనే తొలి ప్రయత్నం ప్రారంభమైనట్టు సమాచారం. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు సోమ వారం నుంచి ప్రారంభం కానున్నాయి.

ఇష్టానుసారంగా ఇన్విజిలేటర్ల విధులు

జిల్లా కేంద్రంలో ఓపెన్ పరీక్షల్లో రూ.లక్షలు చేతులు మారడానికి రంగం సిద్ధమైంది. ఇందుకు అనుగుణంగానే విద్యాశాఖ అధికారులు తమకు అనుకూలంగా వ్యవహరించే ఉపాధ్యాయులను విధులకు కేటాయిస్తూ జాబితా తయారు చేశారనే వాదనలు వినబడుతున్నాయి. కాగా తెలంగాణ ఎస్ఎస్ఎస్ బోర్డు పరీక్ష ఇన్విజిలేషన్ విధులు నిర్వహించిన వారికి కాదని, తమకు అనుకూలంగా ఉన్న వారినే నియమించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రారంభమైన బేరసారాలు..

సాధారణంగా ప్రమోషన్ల కోసం, లైసెన్సుల కోసం పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తుంటారు. రెగ్యులర్ విద్యార్థుల మాదిరిగా వారు చదవలేరు. కనీసం రాయడం కూడా రానివారు ఉంటారని తెలుస్తోంది. అయితే వారిని పాస్ చేయిస్తామని ఒక్కో అభ్యర్థి నుంచి వేలాది రూపాయలు సెంటర్ల వారీగా వసూలు చేయడానికి ప్రణాళిక సిద్ధమైనట్టు (మిగతా 8వ పేజీలో)

రైల్వే ర్యాకులు వదిలి..
రోడ్డు మార్గంలో..

- సత్తుపల్లి ఓసీల నుంచి వాహనాల్లో బొగ్గు రవాణా
- పర్యావరణానికి ప్రమాదమని తెలిసినా పట్టించుకోని అధికారులు
- సీహెచ్‌పీలో బంకర్ల పగుళ్లతో ర్యాకుల ద్వారా తరలింపులో ఇబ్బంది
- కేంద్ర పర్యావరణ శాఖకు పలువురు ఫిర్యాదు?



బొగ్గు లోడింగ్ కోసం వేచి ఉన్న లారీలు

సత్తుపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఓసీల నుంచి ఉత్పత్తయ్యే బొగ్గును రోడ్డుమార్గంలో తరలించడం ద్వారా పర్యావరణానికి ముప్పు వాటిల్లడంతో పాటు రోడ్లు దెబ్బతినడం, తరచూ ప్రమాదాలు జరుగుతాయని గతంలో కేంద్ర పర్యావరణ శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో రైల్వే ర్యాకుల ద్వారా బొగ్గు రవాణా చేయాలని ఆదేశించటంతో ఆమేరకు రైల్వే లైన్లను నిర్మించారు. దాంతో సత్తుపల్లి మండలంలోని ఓపెన్ కాస్టు బొగ్గు గనుల నుంచి ఉత్పత్తయ్యే బొగ్గును రైల్వే ర్యాకుల ద్వారా రవాణా చేయడం ప్రారంభించారు. దీనికి గాను సత్తుపల్లిలో రూ.400కోట్లతో సీహెచ్‌పీ (కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్)ను నిర్మించారు. అప్పటి నుంచి రైల్వే ద్వారానే బొగ్గు రవాణా జరగ్గా.. ఏడాది క్రితం నుంచి మళ్లీ రోడ్డు మార్గంలో లారీల్లో బొగ్గును రవాణా చేస్తున్నారు. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

సీహెచ్‌పీ బంకర్లలో పగుళ్లు..

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రూ.400కోట్లతో 2019లో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. కొవిడ్ కారణంగా పనులు ఆలస్యంగా పూర్తయ్యాయి. ఓపెన్ కాస్టులో బొగ్గును ముందుగా బంకర్ల ద్వారా కోల్ రిసీవింగ్ ప్లాంట్‌కు తరలిస్తారు. అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం కన్వేయర్ బెల్టుపై బొగ్గును కిష్టారం (మిగతా 6వ పేజీలో)


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

భద్రాచలంలో 28న ధర్మయుద్ధం మహాసభ

ఆదివాసీ జేఏసీ నాయకుల వెల్లడి

భద్రాచలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలో ఈ నెల 28వ తేదీన ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్మయుద్ధం మహాసభను నిర్వహించనున్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ జేఏసీ నాయకులు వెల్లడించారు. శనివారం భద్రాచలంలో ధర్మయుద్ధం వాల్‌పోస్టర్లను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భద్రాచలం ఆదివాసీ సమితి, ఆదివాసీ మహిళా చైతన్య శక్తి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మహాసభకు రాష్ట్రంలోని గోండు, కోయ, నాయకపోడు, పర్ధాన్, కొలాం, అంధ్, తోటి, కొండరెడ్డి, చెంచులకు చెందిన ఆదివాసీలు తరలి రానున్నట్లు తెలిపారు. చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తాము నిర్వహించే చలో భద్రాచలం కార్యక్రమం 28న బ్రిడ్జి సెంటర్ నుంచి ప్రారంభం అవుతుందని స్థానిక మార్కెట్ కమిటీ యార్డులోని మైదానంలో సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీలందరూ ఈ కార్యక్రమంకు వేలాదిగా తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ చైర్మన్ చుంచు రామకృష్ణ, పొలిటికల్ జేఏసీ కన్వీనరు పొడియం బాలరాజు, పొడియం నరేంద్రకుమార్, ముర్ల రమేష్, పూనెం కృష్ణ దొర, వీసాల కృష్ణయ్య, గొంది వెంకటరమణ, జగ్గా పుల్లయ్య, ఇర్పా అనసూయ, కుంజా శ్రీను, ముర్రం వీరభద్రం, తెల్లం రమణయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

మున్నేరులో రహదారిని ధ్వంసం చేసిన అధికారులు

- సర్వే నిర్వహించే వరకూ ఇసుక కూపన్ల మంజూరు నిలిపివేత
- సీతంపేట గ్రామంలో చెక్‌పోస్టు ఏర్పాటు

చింతకాని, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమండవ గ్రామంలోని మున్నేటిలో కొనసాగుతున్న ఇసుక అక్రమ దందాపై ఈ నెల 12వ తేదీన 'ట్రాక్టరుకు రూ. 2 వేలు' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం జిల్లాలో సంచలనంగా మారింది. ఈ దందాపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఉన్నతాధికారులు ఎస్సై, తహసీల్దార్‌పై బదిలీ వేటు వేశారు. అక్రమ దందాకు కారణమైన వ్యక్తులు మున్నేటిలో నిబంధనలకు విరుద్ధంగా రహదారి నిర్మించడంతో శనివారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఐపీటీ రైల్వేస్ రాజేశ్వరి ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు రహదారిని జేసీబీతో ధ్వంసం చేశారు. సోమవారం నుంచి ముదిగొండ, చింతకాని, మైనింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఉమ్మడి సర్వే నిర్వహించి లంక భూములకు సంబంధించిను హద్దులు నిర్ణయిస్తామన్నారు. అప్పటి వరకు ఇసుక కూపన్లు మంజూరి చేయకుండా ఉండడంతో పాటు ఇసుక తోలకాలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు సీతంపేట గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్, ఆర్‌ఐలు, సర్వేయర్లు, పోలీసులు పాల్గొన్నారు.


రహదారిని ధ్వంసం చేయిస్తున్న అధికారులు

సింగరేణిలో సంఘాల మధ్య కోల్డ్‌వార్

- కార్మిక సమస్యలను గాలికొదిలేసిన ప్రధాన సంఘాలు
- ఆరోపణలు.. ప్రత్యారోపణలతో వేడి
- వాట్సప్ వేదికగా నేతల 'మాటల యుద్ధం'
- దిష్టిబొమ్మల దహనంతో వివాదం తారస్థాయికి..


దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కార్మిక సంఘం (ఫైల్)

రుద్రంపూర్ (సింగరేణి), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో ప్రధాన కార్మిక సంఘాల మధ్య కోల్డ్‌వార్ ప్రారంభమైంది. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘమైన (ఏఐటీయూసీ), ప్రాతినిధ్య కార్మిక సంఘమైన (ఐఎన్‌టీయూసీ) మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఒకరిపై మరొకరు ఆరోపణలు.. ప్రత్యారోపణలతో సింగరేణి వ్యాప్తంగా వాట్సప్‌లలో యుద్ధ వాతావరణం నెలకొంది. సింగరేణి యాజమాన్యం లాభాలను ప్రకటించడంలో జాప్యం, లాభాల వాటాను కార్మికులకు పంపిణీపై స్పష్టత లేకపోవడంతో.. ఇరు సంఘాలు ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. కార్మిక సంఘాల సమస్యల పరిష్కారంపై రెండు కార్మిక సంఘాలు నువ్వంటే.. నువ్వంటూ నవ్వుల పాలవుతున్న కార్మిక సంఘాలు.. సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలను ప్రతీ ఏడాది దసరా ముందు ప్రకటించడం, వచ్చిన లాభాల నుంచి కార్మికులకు లాభాల వాటా చెల్లించడం.. గత 20 ఏళ్లుగా ఓ సాంప్రదాయంలా కొనసాగుతున్నప్పటికీ.. ఈ ఏడాది లాభాలు ప్రకటించడంలో తీవ్ర జాప్యం కావడం పట్ల కార్మికుల్లో అసంతృప్తి నెలకొంది. దీంతో లాభాల ప్రకటనకు మీ కార్మిక సంఘమే కారణమంటే.. ప్రభుత్వ అనుబంధ కార్మిక సంఘమే కారణమంటూ విమర్శలు చేసుకోవడం తారాస్థాయికి చేరింది. ఇదే కోవలో గత గురువారం కొత్తగూడెంలో ఐఎన్‌టీయూసీ నాయకులు.. ఏఐటీయూసీ కార్మిక దిష్టిబొమ్మను దహనం చేయడం వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లయ్యింది. దీంతో ప్రధాన కార్మిక సంఘాల అగ్ర నాయకులు వివాదానికి తెర దించే విధంగా రాజీ కుదుర్చుకున్నారనే ప్రచారం సింగరేణిలో కొనసాగుతోంది. సింగరేణి కార్మికులకు సంబంధించిన ప్రధానమైన సమస్యలను పరిష్కరించడంలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ నాయకులు గత ఆగస్టు 24న సీఎండీ స్థాయిలో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలని గుర్తింపు సంఘం డిమాండ్ చేస్తోంది. ప్రాతినిధ్య సంఘానికి నాయకత్వం వహిస్తున్న నాయకులు ప్రభుత్వ భాగస్వామ్యంలో కీలక పదవులు అనుభవిస్తూ కార్మికులకు న్యాయం చేయడంలో విఫలమవుతున్నారని ఉటంకిస్తూ పాటల రూపంలో వాట్సప్‌లో ప్రచారం చేయడంతో.. రెండు యూనియన్ల మధ్య వివాదం మరింత ముదిరినట్లు తెలుస్తోంది. సింగరేణి యాజమాన్యం సైతం దసరా పండుగ సమీపిస్తుండడంతో లాభాల వాటాను ప్రకటించడంలో జాప్యం చేయడం పట్ల కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం, ప్రాతినిధ్య కార్మికసంఘం ఉమ్మడిగా కార్మికులకు ఈ ఏడాది వచ్చిన లాభాల వాటాను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. దసరా పండుగ ముహూర్తం ముంచుకొస్తుండడంతో.. తమ కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలతో పాటు ఇతర అవసరాలకు ఉపయోగపడే విధంగా లాభాల వాటాను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో ఉన్న వారికే ఇళ్లు ఇస్తారా?

- భట్టి విక్రమార్క వైఖరి మార్చుకోవాలి
- పక్షపాత ధోరణి మార్చుకోకుంటే ఉద్యమిస్తాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని
- పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర.. ధర్నా


పాదయాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

బోనకల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్‌లో ఉన్న వారికే ఇళ్లు ఇస్తారా? మిగిలిన పార్టీలలో ఉన్న అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వరా? సంక్షేమ పథకాల వర్తింపులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పక్షపాత ధోరణిని అవలంబిస్తున్నారు' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు ఆరోపించారు. అర్హులైన పేదలందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలను అందించాలని, ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని, పంచాయతీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. మండలంలోని లక్ష్మీపురం నుంచి ప్రారంభమైన పాదయాత్ర గోవిందాపురం(ఎల్), గార్లపాడు, రావినూతల గ్రామాల మీదుగా బోనకల్ తహసీల్దార్ కార్యాలయం వరకు చేపట్టారు. అక్కడ రెండు గంటల పాటు ధర్నా నిర్వహించి, సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రమాదేవికి అందజేశారు. అనంతరం జరిగిన ముగింపు సభలో పోతినేని, నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ... ప్రభుత్వం సంక్షేమాలకు ఇస్తున్న సొమ్ము ప్రజలదేనన్నారు. అందువల్ల పక్షపాత ధోరణిని వీడాలని, లేని పక్షంలో అర్హులైన పేదలతో కలిసి భట్టి ఇంటిని ముట్టడిస్తామన్నారు. పాదయాత్రకు వచ్చిన వందలాది మంది కడుపు మంటతోనే వచ్చారని, డబ్బులిచ్చి తాము తెచ్చుకోలేదన్నారు. గోవిందాపురం(ఎల్)లో హత్యకు గురైన ఎర్రబోయిన నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు కూడా ఇల్లు రాలేదని, అదే గ్రామంలో దివ్యాంగుడైన కన్నెబోగు బాబు ఇల్లు కూలిపోతే ఆయనకు కూడా ఇంటిని ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో సీపీఎం శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో పాటు చివర వరకు ప్రజలు పాదయాత్రలో ఉండడంతో పార్టీలో నూతనోత్సాహం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, మాదినేని వీరభద్రం, తుళ్లూరి రమేష్, బందం శ్రీను, తెల్లాకుల శ్రీను, మర్రి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఇసుక అక్రమ రవాణాను నియంత్రించండి

డీఎస్సార్ కమిటీ సమావేశంలో ఖమ్మం కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇసుక, మట్టి అక్రమ రవాణా నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ డీఎస్సార్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతీ మండలం వారీగా గ్రామీణ ప్రాంతాల పరిసరాలలో అందుబాటులో ఉన్న ఇసుక వనరులు, ఇతర గనుల వివరాల సర్వే నివేదికలను తయారు చేసి అందించాలన్నారు. జిల్లాలో ఇసుక, మట్టి అక్రమ రవాణాను నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. ఇసుక, మట్టి రవాణా కోసం జారీ చేసిన అనుమతులను సమీక్షించుకొని నిబంధనలు అమలు అవుతున్నాయా.. లేదో.. పర్యవేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కూడా అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుతుందన్నారు. అయితే జారీ చేసిన అనుమతులు మేరకే ఇసుక రవాణా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఇసుక, మట్టి రవాణాను అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎక్కడా అక్రమ రవాణా జరగకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీపీవో శ్రీనివాస్, భూగర్భ, గనుల సహాయ సంచాలకులు ఆర్. సాయినాథ్, టీజీఎండీసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శంకర్, గ్రౌండ్ వాటర్, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పాల్వంచ ఉపాధ్యాయుడికి

కీర్తి చక్ర జాతీయ పురస్కారం

పాల్వంచ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని డీఏవీ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు కృష్ణారావుకు కీర్తిచక్ర జాతీయ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రకళాభారతిలో శ్రీగౌతమేశ్వర సాహితీ కళా సేవా సమితి కరీంనగర్ ఆధ్వర్యంలో విద్యారంగంలో చేసిన విశిష్ట కృషికి కృష్ణారావుకు శనివారం కీర్తి చక్ర పురస్కారాన్ని అందజేశారు. ఇందులో భాగంగా స్వర్ణ కవచం, బంగారు పతకం, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా డీఏవీ పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం కృష్ణారావును అభినందించి.. ఘనంగా సత్కరించారు.

సీపీఐ జాతీయ మహాసభలకు తరలిన నాయకులు

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్‌లో ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహించే సీపీఐ జాతీయ మహాసభలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 9మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా తెలిపారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుతో పాటు పార్టీ నాయకులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వరరావు, మరాఠి ప్రసాద్, పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, సలీమ్, సలిగంటి శ్రీనివాస్, దేవరకొండ శంకర్‌లు పాల్గొంటారని ఎస్‌కే సాబీర్ పాషా వివరించారు.

రైల్వే ర్యాకులు వదిలి.. రోడ్డు మార్గంలో..

(5వ పేజీ తరువాయి)

సమీపంలో నిర్మించిన మూడు జైలో బంకర్లకు తరలిస్తారు. మూడు బంకర్ల సామర్థ్యం 24వేల టన్నులు. మూడు బంకర్లలో ఒక బంకర్ గతంలో పగుళ్లిచ్చింది. మరో బంకర్ కూడా పగుళ్లు ఇచ్చినట్టు ప్రచారం జరిగింది. స్టోరేజీ బంకర్లలో పగుళ్లరావటంతో ఇబ్బందులు తెలెత్తాయి.

లక్ష్యం మేరకు జరగని రైల్వే రవాణా

స్టోరేజీ బంకర్లలో పగుళ్ల కారణంగా లక్ష్యం మేరకు రైల్వే ర్యాకుల ద్వారా బొగ్గు రవాణా సాగటం లేదని తెలిసింది. దీని కారణంగా స్థానికంగా రెండు ఓపెన్ కాస్టుల్లో బొగ్గు నిల్వలు పేరుకు పోయే పరిస్థితి నెలకొంది. దీంతో ఏడాదికిపైగా బొగ్గును లారీల్లో రోడ్డు మార్గంలో చేస్తున్నారు. సత్తుపల్లి జేవీఆర్-2 ఓపెన్ కాస్టు, కిష్టారం ఓపెన్ కాస్టు బొగ్గు గనుల నుంచి రోజుకు 8వేల టన్నుల బొగ్గు రోడ్డు మార్గంలో ఆర్‌సీహెచ్‌పీ (రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్)కు తరలిస్తున్నారు.

రోడ్డు రవాణాతో ఇబ్బందులు

రోడ్డు మార్గంలో లారీల్లో బొగ్గును తరలిస్తూండటంతో పర్యావరణానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొగ్గు రవాణా చేస్తున్న లారీలు కూడా అతివేగంగా దూసుకొస్తుండటంతో ఎదురుగా వచ్చే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. గతంలో బొగ్గు లారీల వల్ల పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. గత మేనెలలో చంద్రుగొండ మండలంలో బొగ్గు లారీ ఢీకొని వృద్ధుడు చనిపోయిన సందర్భంలో స్థానికులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. బొగ్గు రవాణా రోడ్డు మార్గంలో చేయొద్దని అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారు లేరు. గతంలో జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) కూడా రోడ్డు మార్గంలో బొగ్గురవాణాపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు స్థానిక లారీ, టిప్పర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు ఆరోపించారు. సింగరేణి అధికారులు మాత్రం సీహెచ్‌పీ బంకర్ల నిర్మాణంలో జరిగిన లోపాలకు ఎవరిని బాధ్యులను చేసారో తెలియదు కాని రోడ్డు మార్గంలలో బొగ్గు రవాణాతో స్థానిక ప్రజలు మాత్రం అతివేగంగా తిరుగుతున్న బొగ్గు లారీవల్ల ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో వేల టన్నుల బొగ్గు రోడ్డు మార్గంలో రవాణా చేస్తుండటంపై కేంద్ర పర్యావరణ శాఖకు ఇటీవలపలువురు ఫిర్యాదులు పంపారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు సహకరించాలి

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యాల సాధనలో సకాలంలో రుణాలుఅందజేసి బ్యాంకర్లు సహకరించాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్టతో కలిసి బ్యాంకర్లు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులు, స్వశక్తి, పీఎం స్వానిధి రుణాల మంజూరు, రికవరీ ఎఫ్‌డీవోల ఏర్పాటు, ఇతర అంశాలపై డీసీసీడీఎల్ ఆర్‌సీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ బ్యాంక్, స్టేట్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియా తక్కువ పంట రుణాల పంపిణీ గల కారణాలపై ఆరా తీశారు. స్వయంశక్తి సంఘాలకు చేపల పెంపకం యూనిట్లు, కౌజు పిట్టల పెంపకం తదితర యూనిట్ల స్థాపనకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని, నిర్దేశించిన లక్ష్యాలకు తక్కువగా రుణాలు అందించిన అన్ని బ్యాంకులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రానున్న 3 నెలల కాలంలో 500యూనిట్ల స్థాపనకు బ్యాంకర్లు సహకరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన, ఎల్‌డీఎం రామ్‌రెడ్డి, మెప్మా పీడీ రాజేష్, వివిధ బ్యాంకుమేనేజర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయాలి

జిల్లాలో ఈనెల 17 నుండి వచ్చే నెల 16 వరకు నిర్వహించబోయే పోషణ మాసోత్సవాలను విజయవంతంగా అమలు చేయాలని కలెక్టర్ జితేష్ అన్నారు. శనివారం పోషణ మాసోత్సవాల నిర్వహణపై తన కార్యాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల అధికారులు, ఇతర సంబంధిత విభాగాల అధికారి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట కూడా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నెల రోజుల పాటు కొనసాగనున్న ఈ మాసోత్సవాల ప్రధాన లక్ష్యం గ్రామస్థాయిలో ప్రజల్లో పోషకాహారంపై అవగాహన సృష్టించడం, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు తీసుకోవాల్సిన ఆహారానికి సంబంధించిన మార్గదర్శకత ఇవ్వడం, గ్రామస్థాయి ఆరోగ్య, పోషణ పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, జిల్లా వైద్యశాఖ అధికారి జయలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవులతో..
ఆర్టీసీ బస్టాండ్లు కిటకిట



కొత్తగూడెం బస్టాండ్‌లో బారులు తీరిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రయాణికులు

ఖమ్మం ఖానాపురం హవేలి / కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు దసరా సెలవలు వచ్చాయి. దీంతో విద్యార్థులు ఇళ్లకు పయనమయ్యారు. ఈ క్రమంలో ఖమ్మం, కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్లు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రయాణికుల తో శనివారం కిటకిటలాడాయి. వచ్చే నెల 3వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు దసరా పండుగ సెలవులను ప్రకటించిన నేపథ్యంలో వసతి గృహాల్లోని విద్యార్థులు తమ ఊర్లకు వెళ్లారు. ఇక జూనియర్ కళాశాలకు ఈ నెల 28నుంచి అక్టోబరు 5 వరకు సెలవులు ప్రకటించారు.

అంతా గోప్యంగా!

(5వ పేజీ తరువాయి)

రామాలయానికి రాని వారు కూడా ఇప్పుడు తరచూ రాకపోకలు సాగిస్తుండటం, తమ అనుకూలమైన వారి పనులు చేయాలంటూ కీలక అధికారిపై ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

డిజిటలైజేషన్‌లో సమస్యలను సాకుగా చూపి..

భద్రాద్రి దేవస్థానంలోని అన్ని కీలక విభాగాలను డిజిటలైజేషన్ చేయడం ద్వారా పారదర్శకతకు ప్రాధాన్యమిచ్చారు. కానీ దేవస్థానంలో పనిచేస్తున్న వారిలో కొందరు ఇటీవల ఈ విధానాన్ని నిర్వీర్యం చేసేలా ప్రవర్తిస్తున్నట్టు తెలుస్తోంది. వీఐపీల కోసం ప్రొటోకాల్ విధానాన్ని ఏర్పాటు చేయగా.. తరచూ కంప్యూటర్లు మొరాయిస్తున్నాయని, సాంకేతికపరమైన సమస్యలున్నాయని, ప్రింట్ రావడం లేదని ఇతరత్రా కారణాలను సాకుగా చూపి ప్రొటోకాల్ స్లిప్‌మీద రాసి సాధారణ ముద్రిత టికెట్లను ఇస్తున్నారని సమాచారం. ప్రొటోకాల్‌లో కంప్యూటర్లు మొరాయిస్తున్న విషయం ఇతరత్రా సమస్యలు ఈవో దృష్టికి రావడంతో ఆయన శనివారం పరిశీలించి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించినట్టు తెలిసింది.

చర్చనీయాంశమైన టెండర్ల రద్దు..

ఇటీవల భద్రాద్రి దేవస్థానం వారు ఖరారు చేసిన రెండు టెండర్లను అధికారులు హటాత్తుగా రద్దు చేయడం చర్చనీయాంశమైంది. సాంకేతకపరమైన అంశాల వల్లే టెండర్లను రద్దు చేశామని, ఔట్‌సోర్సింగ్ సెక్యూరిటీ సిబ్బంది నియామకాలకు మరోసారి టెండర్లను ఆహ్వానించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కానీ ఇదంతా తమకు అనుకూలమైన కొంత మంది సిబ్బంది నియామకానికి మార్గం సుగమం చేసేందుకేననే ఆరోపణలు దేవస్థానం వర్గాల నుంచే వినిపిస్తున్నాయి.

విధుల్లో చేరేందుకు పలువురి కసరత్తు

గతంలో పలు ఆరోపణలతో శాఖపరమైన చర్యలకు గురైన కొందరు ఉద్యోగులు మళ్లీ ఆలయ విధుల్లో చేరేందుకు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో ఇటీవల ఒక ఉద్యోగి తాను దేవస్థానానికి చెల్లించాల్సిన మొత్తాన్ని పరిష్కరించుకునేందుకు ఓ కీలక అధికారిని అభ్యర్థించినట్టు తెలిసింది. అయితే పూర్తి మొత్తం చెల్లిస్తేనే తప్ప తానేమీ చేయలేనని సదరు కీలక అధికారి నిస్సహాయత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. అలాగే ఇతర ఉద్యోగులు కూడా తాము దేవస్థానానికి చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించి విధుల్లో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దేవస్థానంలో తరచూ ఆర్థిక పరమైన అవకతవకల ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని నిబంధనల మేరకు తిరిగి ఉద్యోగాల్లో తీసుకున్నా.. ఆర్థికేతర పనులకు మాత్రమే ఉపయోగించాలనే వ్యాఖ్యలు రామ భక్తుల నుంచి వ్యక్తమవుతున్నాయి. దీని వల్ల ఆర్థిక పరమైన అంశాల్లో మరోసారి అవకతకలు జరిగేందుకు అవకాశాలు తక్కువగా ఉంటాయని పేర్కొంటున్నారు.

మావోయిస్టు పార్టీకి 21 ఏళ్లు

- 2004లో పార్టీగా పేరు మార్పు
- ఉద్యమ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు
- నేటి నుంచి వారం పాటు ఆవిర్భావ వార్షికోత్సవాలకు సిద్ధం

చర్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దేశ విప్లవోద్యమ చరిత్రలో అదో కీలక ఘట్టం. వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో సాయుధ పోరాటం చేస్తున్న విప్లవ సంస్థలన్నీ ఒకే గొడుకు కిందకు వచ్చిన రోజు. దేశ నలుమూలల నుంచి రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన రోజు. అదే 2004 సెప్టెంబరు 21. దేశంలోని అన్ని గెరిల్లా సైన్యాలు మావోయిస్టు పార్టీగా ఏర్పడిన రోజు. ఈ 21ఏళ్ల ఉద్యమ చరిత్రలో మావోయిస్టు పార్టీ ఎన్నో ఆటు పోట్లు, ఎన్నో అవరోధాలను ఎదుర్కొంది. రెండు దశాబ్దాల తరువాత 2024 మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆపరేషన్ కగార్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్లల్లో 400 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. మరి కొందరు లొంగిపోగా, వందల మంది అరెస్టయ్యారు. ఇన్ని ఎదురు దెబ్బల మధ్య మావోయిస్టు పార్టీ 21వ వార్సికోత్సవానికి సిద్ధమైంది.

2024లో ఆపరేషన్ కగార్

16 రాష్ట్రాల్లో బలంగా ఉన్న మావోయిస్టు పార్టీని దెబ్బతీసి, మావోయిస్టు రహిత దేశంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం అడుగులు వేసింది. ఆపరేషన్ ప్రహార్, ఆపరేషన్ సూర్యశక్తి, జలశక్తి, కగార్ పేరుతో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా, మహిళా కమాండోస్ సీ60, ఈ 30 బలగాలను రంగంలోకి దింపింది. 2024 జనవరి నుంచి అడవుల్లో పదుల సంఖ్యలో ఎన్‌కౌంటర్లు జరిగాయి. నంబాల కేశవరావు, భాష్కర్, చలపతి, మోడెం బాలకృష్ణ, గాజర్ల రవి, ఇలా 400 మందికిపైగా అనేక మంది మృతి చెందారు. భారీగా ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల డంప్‌లు ధ్వంసం చేశారు. ప్రస్తుతం మావోయిస్టులు ఎక్కడ ఉన్నారో కూడా పార్టీ నాయకులు తెలియడం లేదని పోలీసులు చెబుతున్నారు.

తెర్రం ఘటనతో కుదేలు

2021 ఏప్రిల్ 5న మావోయిస్టు నాయకుడు హిడ్మా ప్లాన్ వేసి తెర్రం అడవుల్లో 22 మంది జవాన్లను హతమార్చాడు. ఈ ఘటన నేపథ్యంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మావోయిస్టుల కదలికలు తెలుసుకుంటూ, ప్రత్యేక టెక్నాలజీని పోలీసులు అందిపుచ్చుకున్నారు. ప్రత్యేక రాడార్‌లను వినియోగిస్తున్నారు. మావోయిస్టులు అధిక సంఖ్యలో మృతి చెందడంతో నేడు హిడ్మాపై బలగాలు దృష్టి సారించాయి.

దండకారణ్యమే కేంద్రంగా

ఎన్నో అవరోధాల మధ్య మావోయిస్టు పార్టీ వార్షికోత్సవాలు వారం పాటు జరగనున్నాయి. ఇప్పటికే తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ అటవీ గ్రామాల్లో కేంద్ర కమిటీ పేరిట మావోయిస్టులు లేఖలు విడుదల చేస్తున్నారు. కాగా మావోయిస్టు పార్టీ 21వ వార్షి కోత్సవాలను తిప్పి కొట్టేందుకు అన్ని రాష్ట్రాల పోలీసులతో పాటు భద్రాద్రి జిల్లా చర్ల సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి, కేశవ తదితర పోలీసులు అప్రమత్తమయ్యారు. దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు అడవుల్లో కూబింగ్ జరుగుతోంది. అటు మహారాష్ట్ర, ఏవోబీ, ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కూబింగ్‌తో డీఆర్‌జీ బలగాలు ముందుకు సాగుతున్నాయి.


ట్రంప్ ఆంక్షలు.. కూలుతున్న ఆశలు!

(5వ పేజీ తరువాయి)

బాగుంటుందని కొండంత ఆశతో వెళ్లారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాదినుంచి విదేశి విద్యార్థులు, ఉద్యోగులపైనా అమెరికాలో పలు నిబధనలతో కొరడా ఝుళిపించడంతో గతేడాది నవంబరు, డిసెంబరుతోపాటు ఈ ఏడాది జూలై, ఆగస్టులో వెళ్లే విద్యార్థుల సంఖ్య సగానికిపైగా తగ్గింది. జిల్లానుంచి కూడా పెద్దగా ఎవరూ వెళ్లలేదు. హెచ్1బీ వీసాలు నిబంధనలతోపాటు ఎఫ్1వీసా నిబంధనలు కఠినతరం చేయడం, మరోవైపు అమెరికాలో చదువుతూ పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తున్న విద్యార్థులపై కేసులు నమోదు సంఘటనలు దృష్టిలో ఉంచుకుని ఈఏడాది అమెరికా చదవులపై విద్యార్థుల్లో ఆసక్తి ఉన్నా వెళ్లలేని పరిస్థితి. కొందరు అమెరికాకు ప్రత్యామ్నాయంగా యూకే, కెనడా, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, ఐర్లాండ్ తదితర దేశాలకు వెళ్లారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో పలు కంపెనీల్లో పనిచేస్తూ వీసాలు ఆయా కంపెనీల నుంచి పొంది నేరుగా అమెరికా వెళ్లి అక్కడ ఉద్యోగాలు చేస్తూ అక్కడ స్థిరపడుతున్నారు. ట్రంప్ ఆంక్షలతో కంపెనీల ద్వారా అమెరికా వెళ్లడం కష్టమవనుండగా.. కేవలం స్టడీ వీసాల వెళ్లే అవకాశం ఉంటుంది. ఎంఎస్ లాంటి చదువుకు రూ.50లక్షలనుంచి రూ.కోటి వరకు ఖర్చవుతుంది. ఇప్పటికే చాలామంది ఎన్‌ఆర్‌ఐలు, విద్యార్థులు చదువులు, ఇళ్ల కోసం ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులనుంచి అధికవడ్డీలకు రుణాలు తీసుకున్నారు. అక్కడ పిల్లలకు ఉద్యోగాలు రాకపోతే బ్యాంకు రుణాలు తల్లిదండ్రులకు భారం కానుండగా.. ఇళ్లపై లోన్లు తీసుకున్నవారిదీ అదే పరిస్థితి కానుంది. ఇంకొందరు అక్కడ రియల్‌ఎస్టేట్ వ్యాపారాల్లోనూ పెట్టుబడులు పెట్టి ఉన్నారు. హెచ్1బీ రద్దయితే తిరిగి సొంత ప్రాంతాలకు వెళ్లమని ఆంక్షలు వస్తే అక్కడ ఏర్పాటుచేసుకున్న ఆస్తులు ఇళ్లు, రుణాలు పరిస్థితులపై గందరగోళం నెలకొంది. ఈ ప్రభావం ఎన్‌ఆర్‌ఐ పెళ్లిళ్లు, సంబంధాలపైనా పడనుంది.

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు


- బత్తినేని ప్రకాష్, టెక్స్కై ఐటీ బిజినెస్, ఎండీ



ట్రంప్ తెచ్చిన హెచ్1బి వీసా కొత్త నిబంధనలతో అక్కడ చదువుకునే భారతీయ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. మన దేశం నుంచి హెచ్1బి వీసాలతో అమెరికాలో ఉద్యోగాలు కోసం వెళ్లే వారికి కొత్త నిబంధనలు వర్తిస్తాయి. ఇప్పటికే అమెరికాలో హెచ్1బి వీసాలతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై ఎలాంటి ప్రభావం ఉండదు. ట్రంప్ కొత్తగా తెచ్చిన వీసా హెచ్1బి నిబంధనలు ఆదివారం మధ్యాహ్నం నుంచి అమల్లోకి వస్తాయి. ఇప్పటికే అమెరికాలో హెచ్1బిపై ఉద్యోగాలు చేస్తున్నవారికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. లక్ష డాలర్ల రుసుము చెల్లింపు కంపెనీయే చెల్లించాలి.

ట్రంప్ నిర్ణయం సరైంది కాదు

- యలమద్ది వెంకటేశ్వర్లు, ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ అసోసియేషన్ ఖమ్మంజిల్లా మాజీ అధ్యక్షుడు



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంచట్ట వ్యతిరేకం. హెచ్1బీ వీసాదారులు లక్ష డాలర్లు చెల్లించాలంటే కంపెనీలకు సాధ్యం కాని పని. తద్వారా అమెరికా వెళ్లేవారికి అక్కడ ఉండి ఉద్యోగాలు చేస్తున్న జిల్లా వాసులకు కూడా తీవ్ర ఇబ్బంది కలిగిస్తుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి సుమారు 10వేల నుంచి 15వేల మంది ఎన్‌ఆర్‌ఐలు ఉద్యోగాల నిమిత్తం వెళ్లగా కొందరు చదువుకోసం వెళ్లారు. ప్రస్తుతం వారి పరిస్థితి గందరగోళంగా ఉంది. న్యాయపరంగా ట్రంప్ నిర్ణయం చెల్లుబాటు కాకపోయినా ప్రస్తుతం పరిస్థితి దారుణంగా ఉంది. అమెరికాలో ఉన్న జిల్లా వాసులకు పెద్దగండంగా మారింది. ట్రంప్ ఇప్పటికైనా తన నిర్ణయాలపై పునరాలోచన చేయాలి.

తీరొక్క పూల పండుగ వచ్చే..

పల్లెల్లో గౌరమ్మ సంబురాలు షురూ
రేపటి ఎంగిలి పూల బతుకమ్మతో వేడుకలు మొదలు
30న సద్దుల బతుకమ్మతో సమాప్తం
తొమ్మిది రోజులపాటు వేడుకలు


పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఖమ్మం ఖానాపురం హవేలి / కొత్తగూడెం కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మహిళల ఆత్మగౌరవ పండుగ బతుకమ్మ. సంస్కృతీ సంప్రదాయాలను కాపాడేలా, జీవన విధానాన్ని తెలియజేసేలా జరుపుకొనే ఈ ఉత్సవానికి మహిళా మణులు సిద్ధమయ్యారు. తంగేడు, తామరాకు, బంతి, చేమంతులు.. ఇలా తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి.. మధ్యలో పసుపుతోచేసిన గౌరమ్మను ఉంచి ఆట పాటలతో పూజించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తొమ్మిది రోజుల పాటు మనుషులు, మనసుల మధ్య ప్రేమానురాగాలు, కష్టసుఖాలు, స్నేహం, కుటుంబనేపథ్యం భక్తితో కూడిన ఈ బతుకమ్మ పాటలు వినసొంపుగా ఉంటాయి. చిన్న పిల్లలనుంచి వృద్ధుల వరకు మహిళలు సంప్రదాయ దుస్తులు, పట్టు వస్త్రాలు, తలనిండా పూలు పెట్టుకుని బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారు. బంధుమిత్రులు, ఇరుగుపొరుగు వారితో కలిసి ఆత్మీయ, అనుబంధాన్ని చాటుకుంటారు. ఆటపాటల తర్వాత బతుకమ్మలను చెరువులు, వాగులు, కొలనుల్లో నిమజ్జనం చేస్తారు. మహిళలు తమ వెంట తెచ్చుకున్న పిండివంటలను వాయినంగా ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకుంటూ ఆప్యాయతను చాటుకుంటారు.

రేపటి నుంచి వేడుకలు..

ఆదివారం మహాలయ అమవాస్య కాగా మరుసటి రోజు నుంచి బతుకమ్మ వేడుకలు జరగనున్నాయి. సోమవారం నుంచి 30వ తేదీ వరకు జరిగే ఉత్సవాల కోసం మహిళలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజుల పాటు జగన్మాత స్వరూపులైన మహాగౌరి, మహాలక్ష్మి, మహాసరస్వతి సహా వివిధ అవతారాలను విభిన్న రీతుల్లో పూజిస్తారు. పూర్వం నుంచే ఈ పండుగ ఉన్నా.. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక అధికారిక పండుగగా కొనసాగుతోంది.

పల్లెపల్లెనా పూల పండుగ

22వ తేదీ నుంచి పల్లెపల్లెనా పూల పండుగ పులకించనుంది. పూలను కొలిచే పుణ్యమైన బతుకు పండుగలో పాల్గొనేందుకు ఆడబిడ్డలు తమ తల్లిగారిళ్లకు చేరుకుంటారు. దీంతో పల్లెలు, పట్టణాలు సందడిగా కన్పిస్తున్నాయి. పట్టణాలు బతుకమ్మ బుట్టలు, వివిధ రకాల పూల విక్రయాలకు సిద్ధంగా ఉన్నాయి. ఇటీవలి వర్షాలకు జలాశయాలకు నీళ్లుచేరడంతో బతుకమ్మ ఘాట్‌లు కూడా సిద్ధమయ్యాయి. గ్రామాల్లోని వాగులు, వంకలు, చెరువులు, కుంటలు జలకళతో ఉన్నాయి. పూలపండుగ కోసం తీరొక్క పూలను సేకరించే పనిలో యువతులు, బాలికల సోదరులు నిమగ్నమయ్యారు.

మర్కెట్‌లో పూల సందడి...

ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమవగా.. పల్లెల్లో పూలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఖమ్మం, కొత్తగూడెం తదిర పట్టణ ప్రాంతాల్లో మార్కెట్లలో అమ్మకాలు ప్రారంభమయ్యాయి. తంగేడు, కట్ల, లిల్లీ, తామర, బంతి, చేమంతి, గునుగు ఇలా ప్రకృతి లోని తీరొక్క పూలను అందుబాటులో ఉంచారు. పూల కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో మార్కెట్‌లో సందడి కన్పించింది.

బతుకమ్మ విశిష్టత..

హైందవ సంప్రదాయంలో కల్యాణం, గృహప్రవేశం, వినాయకచవితి, దీపావళి, వ్రతాలు నిర్వహించేటప్పుడు పసుపుతో గౌరీమాతను తయారు చేసి పూజిస్తారు. బతుకమ్మను పేర్చేటప్పుడు కూడా గౌరీమాతను తయారు చేసి పెడతారు. బతికించి, కోరికలు తీర్చే గౌరీ మాతను బతుకమ్మగా మహిళలు పూజిస్తారు. పెళ్లి వయసు గల యువతులు మంచి భర్త రావాలని, వివాహమైన స్త్రీలు తన భర్త వందేళ్లు ఆయురారోగ్యాలతో బాగుండాలని, తన పసుపు కుంకుమలు కాపాడాలని బతుకమ్మను పూజించడం ఈ పండుగ విశిష్టత. అలంకరణల్లో విశిష్టత కనిపిస్తుంది. బతుకమ్మను పేర్చే టప్పుడు రెండు, ఐదు, ఏడు రకాల పూలు వినియోగి స్తారు. ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్తారు. చెరువు లో నిమజ్జనం చేసి వివిధ రకాలైన పిండివంటలను ఆరగిస్తారు. చెరువు మట్టిని తెచ్చి ముత్తయిదువులు వాయినాలు ఇచ్చుకుంటారు.

ఎంగిలిపూల నుంచి సద్దుల వరకు..

తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. రెండో రోజు అటుకుల బతుకమ్మలో సప్పిడి పప్పు, బెల్లం, అటుకుల ప్రసాదం వినియోగిస్తారు. మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మలో ముద్దపప్పు, బెల్లం, పాలతో ప్రసాదం వినియో గిస్తారు. నాలుగో రోజు నాన బియ్యం బతుకమ్మలో పాలు, బెల్లం, నానేసిన బియ్యంతో ప్రసాదం వినియోగిస్తారు. ఐదో రోజున అట్ల బతుకమ్మను బియ్యం నానబెట్టి దంచిన పిండితో తయారుచేసిన అట్ల (దోశలు) ప్రసాదం వినియోగిస్తారు. ఆరో రోజున అలిగిన బతుకమ్మలో బతుకమ్మ అలిగినట్లుగా భావించి ఆ రోజు బతుకమ్మలు పేర్చరు. ఆడరు. ఏడో రోజున వేపకాయల బతుకమ్మలో సకినాలు చేసే పిండితో వేప కాయలంత పరిమాణంలో ముద్దలుగా చేసి నూనెలో వేయించిన వంటకం ప్రసాదంగా పెడతారు. ఎనిమిదో రోజున వెన్నముద్దల బతుకమ్మలో నువ్వులు, వెన్న, బెల్లం, నెయ్యితో తయారుచేసిన ఫలహారం వినియోగిస్తారు. తొమ్మిదో రోజున(30న) సద్దుల బతుకమ్మలో ఐదు రకాల సద్దుల అయిన ఫలహారం, పెరుగన్నం, చింతపండు పులిహోర, సద్ది, కొబ్బరి తురుము, నువ్వుల పొడి కలిపిన సద్ది ఫలహారం వినియోగిస్తారు. ఇలా తొమ్మిది రోజులపాటు బతుకమ్మ ఆడిపాడిన మహిళలు సద్దుల బతుకమ్మ రోజున అంగరంగ వైభవంగా బతుకమ్మల సామూహిక నిమజ్జనోత్సవాన్ని జరుపుతా రు. బతుమ్మకను సాదరంగా సాగనంపుతారు.

బతుకమ్మకు ప్రీతికరం ఏడెగడ్డి పూలు



కరకగూడెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాలాన్ని బట్టి పలు రకాల వృక్షాలు, పూలతోటలు ఆ సమయాల్లో చిగిరిస్తూ చూపారులను ఆకర్షిస్తాయి. అందులో భాగంగానే ఏడెగడ్డి పూలు వాగుల్లో, ఒర్రెల్లో పూల తోటవలే కనువిందు చేస్తున్నాయి. ప్రతీ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలలల్లో ఏడెగడ్డి పూలు ఎంతో ఆహ్లాదంగా కనిపించే ఈ పూలు బతుకమ్మకు ఎంతో ప్రీతి అని చెబుతుంటారు. గడ్డిజాతి పువ్వులే అయినా ఏడెగడ్డి పూలను చూసి ఇష్టపడని వారుండరు.

బాలికలు చదువుతో పాటు ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలి

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్


మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలికలు చదువుతో పాటు ఆత్మరక్షణ విద్యలైన మార్షల్ ఆర్ట్స్, సెల్ఫ్ డిఫెన్స్‌లో కూడా శిక్షణ నేర్చుకోవడం బాలికలకు ఎంతో ఉపయోగపడతాయని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. శనివారం భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 15రోజుల పాటు శిక్షణ తీసుకున్న బాల బాలికలు ప్రతిరోజూ సంబంధించిన మెళకువలు సాధన చేస్తూ ఉండాలన్నారు. బాలికలు కష్ట సమయంలో మాత్రమే మీరు నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్ విద్యకు పని కల్పించాలని సూచించారు. మనసులో ధైర్యం నిండుకొని ముందడుగు వేయడానికి శక్తిని ఇస్తుందన్నారు. ఇటువంటి విద్యలు విపత్కర పరిస్థితిలో మాత్రమే ఇటువంటి విద్యలకు పని చెప్పాలని బాలికలకు సూచించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాన్‌మిల్టన్, రఘు, సుమా వైస్ ప్రిన్సిపాల్ హవేల, అకడమిక్ కోఆర్డినేటరు హిమజ, మహిళ సిబ్బంది కపిల భారతి, సమీరా, శ్రీలత పాల్గొన్నారు.

సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు


క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, కోచ్ గౌస్

ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23 నుంచి 25 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నాగార్జున యూనివర్సిటీ లో జరగనున్న సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లాకు చెందిన 10 మంది క్రీడాకారులు ఎంపికైనారు. ఈ మేరకు సర్దార్ పటేల్ స్టేడియంలోని అథ్లెటిక్స్ అకాడమీకి చెందిన గౌతమ్, గోపీచంద్, అశోక్, వివేక్‌చంద్ర, మస్తాన్, ముబీన్‌లతో పాటు స్టేడియంలో నిత్యం సాధనచేసే ఆఫ్రీన్, వైశాలి, బిందు, మనుశ్రీలు సైతం ఎంపికైనారు. వారు ఇటీవల జరిగిన పలు రాష్ట్రస్థాయి పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రజట్టు తరుపున వారు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ షఫీ, కోచ్ గౌస్ తదితరులు అభినందించారు. సౌత్‌జోన్ పోటీల్లో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు.

రేపు అండర్-17, 19 ఉషూ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 22న అండర్-17,19 బాల, బాలికల ఉషూ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు ఏజీఎఫ్ జిల్లా సెక్రెటరీ పూనాటి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పదో తరగతి మార్కుల మెమో, ఆధార్, స్టడీ సర్టిఫికెట్, ఒక ఫోటో తీసుకుని సోమవారం ఉదయం 9గంటలకు స్టేడియానికి చేరుకోవాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 9948199743 నెంబరును సంప్రదించాలని కోరారు.

6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మైనారిటీల కొరకు ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన, రేవంతన్న కా సహారా పథకాలను ప్రభుత్వం ప్రారంభించిందని, ఈ పథకాల కింద అందించనున్న సహాయం కొరకు జిల్లాలోని అరు లైన మైనార్టీమహిళలు, ఫకీర్, దూదేకులు అక్టోబర్ 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం కింద వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలు, అవివాహితలకు చిన్న చిన్న వ్యాపారాల కొరకు ఒక్కొక్కరికి రూ.50 వేలు సహాయం, రేవంతన్నా కా సహారా పథకం కింద ఫకీర్, దూదేకుల వర్గాలకు మోపెడ్ వాహనాల కొనుగోలుకు ఒక్కొక్కరికి రూ.లక్ష గ్రాంట్ అందజేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9704003002 ఫోన్ నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పేర్కొన్నారు.

ఛండీఘర్‌కు తరలిన సీపీఐ నేతలు

ఖమ్మం అర్బన్ సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లోని మొహాలీలో జరుగనున్న సీపీఐ 25వ జాతీయ మహాసభలకు ఖమ్మం జిల్లా ప్రతినిధివర్గం శనివారం బయల్దేరి వెళ్లింది. సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు నేతృత్వంలో వీరంతా చండీఘర్ మహాసభలకు ప్రతినిధులుగా వెళ్లారు. బృందంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేంద్రరెడ్డి, రాష్ట్ర సమితి సభ్యుడు యర్రబాబు, ఎస్‌కే జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, తదితరులు ఉన్నారు.

సింగరేణిలో మైనింగ్ అధికారుల బదిలీలు

రుద్రంపూర్ (సింగరేణి), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి మైనింగ్ విభాగంలో పనిచేస్తున్న 31 మంది అధికారులను బదిలీ చేస్తూ సింగరేణి యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ జీఎం హోదాలో పనిచేస్తున్న ఇరువురిని, డీవైజీఎంలుగా పనిచేస్తున్న ఐదుగురిని, వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులను బదిలీలు చేశారు. మణుగూరు ఏరియాలో అడిషనల్ జీఎంగా పని చేస్తున్న వీరభద్రరావును మణుగూరు ఏరియాలోని పీకేవోసీకి బదిలీ చేశారు. మణుగూరు ఏరియా సర్వే ఆఫీసర్‌గా పనిచేస్తున్న దివ్య వెంకట రామారావును ఎస్‌వోటూ జీఎం మణుగూరుకు బదిలీ చేయగా.. డీవైజీఎంగా మణుగూరులో పనిచేస్తున్న కె.చంద్రశేఖర్‌రావును రామగుండం-1కు, మణుగూరు ఎస్‌వోటూ జీఎంగా పనిచేస్తున్న బసవోజు శ్రీనివాసాచారిని కొండాపూర్ ఏజెంట్‌గా బదిలీ చేశారు. సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న వేణుమాధవ్‌ను మణుగూరు సేఫ్టీ అధికారిగా బదిలీ చేశారు. బదిలీ అయిన అధికారులంతా వెంటనే విధుల్లో చేరాలని యాజమాన్యం ప్రకటించింది.

సింగరేణి కార్మికులకు 35శాతం లాభాల వాటా చెల్లించండి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కూనంనేని వినతి

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థకు వచ్చిన లాభాల నుంచి కార్మికులకు 35శాతం బోనస్‌ను చెల్లించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరివి రాజ్‌కుమార్‌లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్లు ఎమ్మెల్యే కూనంనేని ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి కార్మికులకు సంబంధించిన మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని, కార్మికుల సొంతింటి కల నెరవేర్చే హామీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా కోయగూడెం-3, సత్తుపల్లి-3, తాడిచర్ల-2 బొగ్గు బ్లాకులను సింగరేణికి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు. అన్ని సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని ఏఐటీయూసీ నాయకులు సీఎంకి కృతజ్ఞతలు తెలిపారు.


సీఎం రేవంత్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

పర్ణశాలను సందర్శించిన డైరెక్టర్

'ప్రసాద్' పనులను పరిశీలించిన ఈవో


కుటీరం వద్ద డైరెక్టర్ మోహన్‌రావు

దుమ్ముగూడెం సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల రామాలయాన్ని టీఎస్ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్‌రావు శనివారం సందర్శించారు. చినబండిరేవులో సుమారు రూ.1.93కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ ఉపకేంద్రం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. డీఈ జీవన్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఏడీఈలు ప్రభాకర్‌రావు, యాసిన్, ఏఈ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. భద్రాచలం దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు శనివారం పర్ణశాలలో ప్రసాద్ పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఏఈఓ శ్రావణ్‌కుమార్, సీసీ శ్రీనివాసరెడ్డి, ఆలయ ఇన్‌చార్జ్ అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

రూ. 20 లక్షల విలువచేసే బంగారం స్వాధీనం
వివరాలు వెల్లడించిన ఏసీపీ తిరుపతిరెడ్డి


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ తిరుపతి రెడ్డి

ఖమ్మం రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను రూరల్, సీసీఎస్, రఘునాథపాలెం పోలీసులు వెంకటగిరి గ్రామ ప్రాంతంలో శనివారం అరెస్టు చేశారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ తిరుపతిరెడ్డి వివరాలు వెల్లడించారు. రఘునాథపాలెం మండలం, రేగులచెర్ల గ్రామానికి చెందిన జంగా వెంకన్నపేంటింగ్ పని చేస్తున్నాడు. రేగులచెర్ల గ్రామానికి చెందిన వల్లెబోయిన లక్ష్మణరావు ట్రాక్టర్ డ్రైవర్‌గా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, గొల్లగూడెం గ్రామానికి చెందిన వల్లపు సుమంత్ కార్‌డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. వీరు ముగ్గురు స్నేహితులు. ఈ ముగ్గురు కలిసి రాత్రి సమయాల్లో ఇండ్లలో ఎవరు లేనిది గ్రహించి ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో బంగారం, నగదు తదితర వస్తువులను అపహరించుకు పోతుంటారు. అయితే వీరు రూరల్ మండలంలోని కామంచికల్, గొల్లగూడెం, మద్దులపల్లి, నందనవనంతో పాటు నేలకొండపల్లి, రఘునాథపాలెం, ఖానాపురం, కల్లూరు, కోటపాడుతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ మండలాల్లో దొంగతనాలకు పాల్పడటం జరిగింది. వీరిపై ఆయా మండలాల పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. వీరిపై మొత్తం 9కేసులు నమోదు అయ్యాయి. అయితే ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటగిరి ప్రాంతంలో శనివారం ఉదయం అనుమానాస్పదంగా ఈ ముగ్గురు వ్యక్తులు కనిపించడంతో పోలీసులు అరెస్టు చేసినట్లు విచారించగా వారు చేసిన దొంగతనాల వివరాలు తెలిపారు. వారి వద్ద నుండి రూ.20 లక్షల విలువచేసే 190గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో సీఐ రాజు, సీసీఎస్ ఎస్‌ఐ. శ్రీనివాస్, ఎస్‌ఐలు విశ్వతేజ, హరికృష్ణ, సీసీఎస్ పోలీసులు పాల్గొన్నారు. ఈ కేసును చేధించిన పోలీసులను ఏసీపీ తిరుపతిరెడ్డి అభినందించారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

బోనకల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో శనివారం అక్రమంగా మట్టి తోలకాలు జరుపుతున్న మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ పొదిలి వెంకన్న తెలిపారు. మట్టి తోలకాలు జరుగుతున్నాయన్న సమాచారంతో వెళ్లి చూడగా మట్టి లోడ్‌తో ఉన్న టిప్పర్‌తో పాటు రెండు లోడింగ్ కాకుండా ఉండటాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. మట్టిలోడ్ టిప్పర్‌ను మైనింగ్ శాఖకు పంపించామని, ఖాళీ టిప్పర్లకు ఈ-చలాన విధించినట్లు తెలిపారు. అక్రమంగా మట్టి తోలకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● అమావాస్య చంద్రుడు..!

ఆదివారం అమావాస్య.. పైగా సూర్యగ్రహణం కూడా.. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పండు వెన్నెల కురిపించిన ఆ చంద్రుడు ఇదిగో ఇలా అమావాస్య చంద్రుడిలా కనిపించాడు. అమావాస్య, సూర్యగ్రహణానికి ముందు రోజు శనివారం తెల్లవారుజామున కనిపించిన చంద్రవంక కనువిందు చేసింది. ఈ దృశ్యం వైరా రిజర్వాయర్ వద్ద కనిపించింది. - వైరా, ఆంధ్రజ్యోతి



విష జ్వరాలు.. పడకేసిన పల్లెలు

రోజు రోజుకూ పెరుగుతున్న కేసులు
జ్వర పీడితులతో ప్రభుత్వ ఆస్పత్రి కిటకిట
ప్రబలుతున్న డెంగీ, టైఫాయిడ్..


జూలూరుపాడులోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

జూలూరుపాడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజలు విషజ్వరాల బారినపడి మంచాలు పట్టారు. చిన్నా పెద్దా తేడాలేకుండా జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాల బారినపడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోజు రోజుకు జ్వర పీడితుల సంఖ్య పెరిగిపోతుంది. రోజుల తరబడి పీడిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది ఖమ్మం, కొత్తగూడెంలోని ఆసుపత్రులలో చేరి చికిత్సలు పొందుతున్నారు. రక్త కణాల సంఖ్య తగ్గిపోతుండతో ఆందోళనకు గురవుతున్నారు. జ్వరపీడితులతో జూలూరుపాడులోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో సేవాలు పొందే వారిసంఖ్య గత కొన్ని రోజులుగా పెరిగిపోయింది. రోజుకి 180 నుంచి 200 మంది వరకు సేవాలు పొందేందుకు వస్తున్నారని, వీరిలో ఎక్కువ మంది జ్వర పీడితులే ఉంటున్నారని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికే మండలంలోని వాగొడ్డుతండా, పడమటనర్సాపురం, మాచినేనిపేట, పాపకొల్లు, కొత్తూరు, కరివారిగూడెం, అన్నారుపాడు తదితర గ్రామాలలో డెంగ్యూ కేసులు నమోదైయ్యాయి. ప్రభుత్వ వైద్యసిబ్బంది ఈ ఏడాది మండలంలో నాలుగు కేసులు మాత్రమే వచ్చాయని నిర్ధారిస్తున్నప్పటికి పలు గ్రామాలలోని ప్రజలు డెంగ్యూ బారిన పడ్డారు. టైఫాయిడ్ కేసులు కూడా అధికంగా నమోదైయ్యాయి. జ్వరాన బారిన పడి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులో పదుల సంఖ్యలో చికిత్సలు పొందుతున్నారు. మండలంలోని అన్నారుపాడు, పాపకొల్లు, మాచినేనిపేట, వెంగన్నపాలెం, జూలూరుపాడు, పడమటనర్సాపురం, బేతాళపాడు తదితర గ్రామాలలో జ్వరాలు అధికంగా ఉన్నాయి. పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతోనే దోమలు వ్యాప్తి చెంది జ్వరాలు ప్రబులుతున్నాయని ప్రజలు అంటున్నారు.

కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి

ఉద్యోగభద్రత, సంక్షేమమే ఏఐటీయూసీ లక్ష్యం
ఖమ్మంలో కదం తొక్కిన మునిసిపల్ కార్మికులు
మునిసిపల్ వర్కర్స్ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి



ఖమ్మంలో ర్యాలీ నిర్వహిస్తున్న మునిసిపల్ కార్మికులు

ఖమ్మం అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న మునిసిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ కార్మిక సంఘం రాష్ట్రకార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ మునిసిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ మూడవ మహాసభ శనివారం ఖమ్మంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగింది. ఊడల కృష్ణ, తాటి నాగేంద్రబాబు అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈమహాసభలో జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. దసరా పండుగతరువాత మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం డిమాండ్ చేస్తూ పోరాట కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. మునిసిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు, కనీస వేతనాల వర్తింపు, తదితర డిమాండ్లతో పోరాటం నిర్వహిస్తామన్నారు. మునిసిపల్ కార్మికుల ఉద్యోగ భద్రత, సంక్షేమమే లక్ష్యంగా ఏఐటీయూసీ పనిచేస్తుందని మునిసిపాలిటీల్లో, మునిసిపల్ కార్పొరేషన్లలో శ్రమదోపిడీ జరుగుతోందని ఆయన ఆరోపించారు. నగరాలు, పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దటంలో కీలక భూమిక వహిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించటం లేదన్నారు. ప్రతి పారిశుధ్య కార్మికుడికి నెలకు రూ.26వేలు చెల్లించాలన్నారు. గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను ఇంకా నైపుణ్యత లేని వారిగా పరిగణించటం ఏమిటని ప్రశ్నించారు. మునిసిపల్ కార్మికుల పట్ల పని వత్తిడికి గురిచేస్తూ కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైరాలో స్పెషల్ డ్రైవ్ కింద 55మందిని తీసుకున్నారని వారికి మునిసిపల్ చట్టాలను వర్తింపచేయాలన్నారు. మహాసభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు రావి శివరామకృష్ణ, వేము రాంబాబు, గారపాటి అశోక్, సీహెచ్ వెంకటేశ్వరరావు, కృష్ణ, బుర్రి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. మహాసభల సందర్భంగా జెడ్పీసెంటర్ నుంచి అంబేద్కర్ భవన్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వందలాది మంది కార్మికులు పాల్గొని కదంతొక్కారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టీజీ క్లెమెట్ ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు.

రామయ్యను దర్శించుకున్న ప్రముఖులు

హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్, విశ్రాంత ఐఎఎస్ ఐవీ సుబ్బారావు, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ పూజలు


రామాలయంలో హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్


విశ్రాంత ఐఏఎస్ ఐవీ సుబ్బారావు

భద్రాచలం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్ కుటుంబ సభ్యులు రామయ్యను దర్శించగా దేవస్థానం అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. న్యాయమూర్తి నగేష్‌కు దేవస్థానం తరఫున శాలువ, స్వామివారి ప్రసాదంను ఈవో కె.దామోదర్‌రావు అందజేశారు. అలాగే ఉపరాష్ట్రపతి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐవీ సుబ్బారావు కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే దేవస్థానం తరఫున జ్ఞాపిక, ప్రసాదం, శాలువను అందజేశారు. అదే విధంగా భారత క్రికెట్‌జట్టు మాజీ క్రీడాకారుడు వీవీఎస్ లక్ష్మణ్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగూ ఏపీలోని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్వీఎస్ కేకే రంగారావు స్వామివారిని దర్శించి పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా పీఆర్‌టీయూ రాష్ట్రశాఖ అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్ రామయ్యను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో భద్రాచలం దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ప్రధాన అర్చకులు విజయరాఘవన్, తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్‌రావు, అర్బ నరసింహారావు పాల్గొన్నారు.



నోటరీ న్యాయవాదుల సమస్యలు పరిష్కరించండి


జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్‌కు వినతి

ఖమ్మంలీగల్,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): నోటరీ న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్‌కు నోటరీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు శనివారం వినతిపత్రం సమర్పించారు. నిబంధనలకు విరుద్ధంగా జీరాక్స్ సెంటర్ల వద్ద నోటరీ చేస్తుండటంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీరాక్స్ సెంటర్లు, టైపిస్టులు నోటరీ దందా, నకిలీ నోటరీల గుర్తింపు వంటి వాటిపై దృష్టి పెట్టాలని కోరారు. నోటరీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పారుపల్లి అమర్‌చంద్, ప్రధాన కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ చౌదరి, కోశాధికారి మందా రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

ధరల బోర్డుతో కూరగాయల అమ్మకాలు

» నగర ప్రజల హర్షం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలో ఎంతో కీలకమైన పాతబస్టాండ్ ఎదురుగా ఉన్న ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ రైతుబజార్(వీధివ్యాపారుల ప్రాంగణం)లో బహిరంగంగా ధరల బోర్డును ఏర్పాటు చేసి అమ్మకాలు జరిపారు. శుక్రవారం ధరలు బహిరంగ ప్రదర్శన లేకుండా అమ్మకాలు జరపటంతో 'ఆంధ్రజ్యోతి'వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, మార్కెటింగ్ అధికారి శివకృష్ణ రైతు బజార్‌లో కూరగాయల ధరల బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో కూరగాయలు కొనుగోలుకు వచ్చిన నగర ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని అన్ని రైతు బజార్లు వలే ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కూరగాయల మార్కెట్‌లోను అమ్మకాలు ఇలానే కొనసాగించాలని కోరారు.

వేడుకగా ఆర్జేసీ ఫ్రెషర్స్‌డే వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్జేసీ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు శనివారం నగరంలోని ఎంబీగార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాధన కోసం ప్రణాళిక ప్రకారం ముందుకు సాగితే దేనినైనా సాధించ వచ్చన్నారు. ఖమ్మం నగరంలో 26 సంవత్సరాల క్రితం ప్రారంభించిన తమ కళాశాల అనేక విజయాలు సాధించిందన్నారు. బీకాంలో యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. గత సంవత్సరం కూడా తమ కళాశాల రెండు గోల్డ్ మెడల్స్‌ను సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్జేసీ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఏ.లింగయ్య, ఎస్.లక్ష్మీపతి, డిగ్రీ ఇన్‌చార్జీ ఆంజనేయులుతో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వల చేస్తున్న చైర్మన్ కృష్ణ

బొమ్మ ఫార్మసీ కళాశాలకు పేటెంట్ గ్రాంట్

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బొమ్మ ఫార్మసీ కళాశాలకు మూడోసారి పేటెంట్ గ్రాంట్ అభించిందని కళాశాల చైర్మన్ రాజేశ్వరరావు తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పేటెంట్‌పత్రాలను విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ విభాగం నుంచి వేరియబుల్ ఏఐ పవర్డ్ డ్రగ్ డెలివరిప్యాడ్ డిజైన్ నెంబరు 458934-001, ఎస్ఎన్‌వో, 209067కు ఈనెల11న పేటెంట్ గ్రాంట్‌ను మంజూరు చేశారని తెలిపారు. ఈ పరికరంతో రోగులకు మందులు అందించటంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావటానికి రూపొందించబడిందని తెలిపారు.



పేటెంట్ పత్రాలతో కళాశాల చైర్మన్ రాజేశ్వరరావు

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి):ఇటీవల ఖమ్మం రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మృతదేహాన్ని ఖమ్మం రైల్వేపోలీసులు ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరిచారు. మూడు రోజులు దాటినా మృతదేహం కోసం రాకపోవటంతో అన్నంఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

తిరుమలాయపాలెం, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆత్మ కమిటీచైర్మన్ చావా శివ రామకృష్ణ కోరారు. శనివారం మండలంలోని పిండిప్రోలు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో షూలు, సాక్సులుపంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీ బోడమంగిలాల్, గుగ్గిళ్ల అంబేద్కర్, సైపుద్దీన్, గురవయ్య,శ్రీనివాస్, రాయిండ్ల వెంకన్న పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ముందస్తు 'బతుకమ్మ'

ఖమ్మంఖానాపురం హవేలి, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): పలు ప్రైవేటు పాఠశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో వేడుకలు నిర్వహించారు. సంస్కృతి సంప్రదాయాలను వివరించారు.





స్ప్రింగ్‌లీఫ్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్న సిబ్బంది, శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో పాల్గొన్న నిష్ఠాశర్మ



సర్వజ్ఞలో..



రెజోనెన్స్ శ్రీనగర్‌కాలనీలో..



స్మార్ట్‌కిడ్జ్‌లో..



త్రివేణిలో..



మంద్రాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో..



విజ్ఞాన్ పాఠశాలలో..

పరిశుభ్ర నగరంగా ఖ్యాతి పొందాలి

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఖమ్మంకార్పొరేషన్,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వాహణ చర్యలు నూరుశాతం అమలు చేస్తూ పరిశుభ్రమైన నగరంగా ఖమ్మానికి ఖ్యాతి తీసుకు రావాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. శనివారం నగరంలోని 5, 46, 47, 48, 53 డివిజన్లలో కమిషనర్ తనిఖీలు చేశారు. పారిశుధ్య నిర్వాహణ తీరును పరిశీలించారు. స్వీపింగ్ మిషన్ల వినియోగం, డివైడర్ల మరమత్తులు, సైడ్ డ్రైయినేజీల నిర్వహణను తనిఖీలు చేశారు. నగరంలో పారిశుధ్యం మెరుగుపడిందని ఇంకా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్యం సక్రమంగా నిర్వహించకుంటే సంబందిత జవాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్‌సీఐ గోడౌన్ ప్రాంతంలో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌ను ఆదేశించారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్

ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి

తిరుమలాయపాలెం, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగానికి ప్రభుత్వం 24గంటలపాటు విద్యుత్ సౌకర్యం అందిస్తుందని ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. శనివారం మండలంలోని బచ్చోడు సబ్‌స్టేషన్ పరిధిలో జూపెడకు 11కేవీ ఫీడర్‌ను ఆయన ప్రారంభించారు. లోఓల్టేజీ సమస్య పరిష్కరించేందకు జూపెడ ప్రాంత రైతులకు నూతనంగా 11కేవీ ఫీడర్‌ను ఏర్పాటు చేశామన్నారు. రైతులు విద్యుత్ పొదుపుగా వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ నాగేశ్వరరావు, బద్రుపవార్, బాబురావు, ఏడీఈలు కోక్యా, రమేష్, ఏఈ మునీర్‌పాష పాల్గొన్నారు.

చావు బతుకుల్లో.. సెలవులకు సతాయింపు

ఏఎంసీ ఆమోదం తెలిపినా.. అంగీకరించని పారిశుధ్య పర్యవేక్షకులు

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో తమకు అనుకూలంగా ఉండే కార్మికులకు చిన్న చిన్న అవసరాలకు వెంటనే సెలవులు మంజూరు చేసే పారిశుధ్య పర్యవేక్షకులు.. వైకుంఠధామాల్లో రాత్రింబవళ్లు సేవలందించే కార్మికుల పట్ల మాత్రం వివక్ష చూపుతున్నారు. సరిగ్గా ఇదే కోవలో బల్లేపల్లి వైకుంఠధామంలో పనిచేసే ఓ కార్మికుడు జిల్లా ఆస్పత్రిలో మూడు రోజులుగా అత్యవసర వైద్యసేవలు పొందుతున్నాడు. అయితే అతని సెలవు కోసం కుటుంబ సభ్యులు మూడు రోజుల నుంచి కేఎంసీ చుట్టూ తిరుగుతుండడం దారుణం. వివరాల్లోకి వెళితే.. బల్లేపల్లి వైకుంఠధామంలో చాట్ల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వంశపారంపర్యంగా దశాబ్దాల తరబడి కార్మికుడిగా పని చేస్తున్నాడు. గత వారం అనారోగ్యానికి గురి కావడంతో.. మూడు రోజుల క్రితం జిల్లా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. ఈ క్రమంలో చాట్ల వెంకటేశ్వర్లుకు సెలవు మంజూరు చేయాలని కుటుంబ సభ్యులు కేఎంసీ చుట్టూ తిరుగుతున్నారు. అయితే అసిస్టెంట్ కమిషనర్ అనిల్ సెలవు మంజూరు చేసినా.. పారిశుధ్య పర్యవేక్షకులు అంగీకరించకపోవడం.. కేఎంసీ ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతూ ఇన్‌పేషెంట్‌గా ఉన్న కార్మికులకు సెలవు ఇవ్వకపోవడం పట్ల కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అసిస్టెంట్ కమిషనర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. తాను సెలవు మంజూరు చేశానని తెలిపారు. అయితే పారిశుధ్య పర్యవేక్షకుడి తీరు విషయమై కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.



జిల్లాసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు

'ఓపెన్' కాపీయింగ్‌కు సర్వం సిద్ధం!

(5వ పేజీ తరువాయి)

తెలుస్తోంది. స్టడీసెంటర్లలో ఉన్న తమ అనుచరులతో అభ్యర్థులను పాస్ చేయిస్తామని చెప్పి ప్యాకేజీలు మాట్లాడుకుంటున్న సమాచారం.

పరీక్ష విధులకు ఉపాధ్యాయుల్లో పోటీ..

ఓపెన్ స్కూల్ పరీక్ష విధులు నిర్వహిస్తే సదరు ఉపాధ్యాయుడికి సంపాదిత సెలవులు వస్తాయి. వాటిని విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది. ఒక్కరోజు సెలవు సుమారురూ.4వేల విలువ ఉంటుండగా, మొత్తం డ్యూటీలు చేస్తే రూ 40 వేల జీతం అదనంగా అందనుంది. దీంతో ఉపాధ్యాయులలో పోటీ నెలకొంది. సాధారణంగా సీనియార్టీ ప్రకారమే ఇన్విజిలేషన్ విధులు కేటాయిస్తుంటారు. సీఎస్‌లు, డీవోలుగా సీనియారిటీని విస్మరించి ఇష్టానుసారంగా నియామకాలు చేసినట్టు విమర్శలు వస్తున్నాయి. నగరంలో ఉన్న వారిని కాదని దూర ప్రాంతాలకు చెందిన వారిని, మారుమూల పాఠశాలల వారికి విధులు కేటాయించారని తెలుస్తోంది. కాగా ఆయా పాఠశాలల్లో సీనియర్ ఉపాధ్యాయులు ఉన్నా వారిని కాదని జూనియర్ ఉపాధ్యాయులకు ఇన్విజిలేటర్లగా అవకాశం కల్పించడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రేపటి నుంచి 28వరకు పరీక్షలు

తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్ 2025 థియరీ పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి 28వరకు జరుగుతాయని ఇన్‌చార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి, జడ్పీసీఈవో దీక్షారైనా, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ మంగపతిరావు తెలిపారు. ఖమ్మంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదోతరగతి, రిక్కాబజార్ పాఠశాలలో ఇంటర్ పరీక్షలు జరగనుండగా.. మొత్తం 541 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాలకు ఒకచీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారి, సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించారు.

జాతీయ రహదారులకు భూ సేకరణ పూర్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణాల కోసం భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు.శనివారం హైదరాబాద్ నుంచి ఆయన జాతీయ రహదారుల నిర్మాణపురోగతిపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పలు జాతీయ రహదారుల పనులు భూసేకరణ ఆలస్యం కావడం వల్ల పురోగతి ఆశించిన స్థాయిలో ఉండటం లేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పేదల ఆప్తమిత్ర.. కురువెళ్ల

» ఫౌండేషన్‌తో నిరుపేదలకు పలు సేవా కార్యక్రమాలు
» అదే ఒరవడితో చాంబర్ ఎన్నికల్లో అధ్యక్ష పోటీకి ఉత్సాహం
» ప్రవీణ్‌కుమార్ రాకతో యువవ్యాపార వర్గాల్లో నూతనోత్సాహం



ఖమ్మంస్పోర్ట్స్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు త్వరలో జరగబోయే ఎన్నికలపై యువవ్యాపార వర్గాలు ఉత్సాహం చూపుతున్నాయి. నవంబర్‌లో జరిగే ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేసేందుకు నగరానికి చెందిన ప్రముఖ సామాజిక, వ్యాపారవేత్త కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ పోటీలో నిలవడంతో ఈఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. ఖమ్మానికి చెందిన ప్రవీణ్ తనదైన శైలిలో పలు రకాల వ్యాపారాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సమాజానికి ఉపయోగపడే విధంగా ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహించారు. వ్యాపార అభివృద్ధికి కొందరు వ్యాపారులను సంఘటితం చేశారు. సేవా కార్యక్రమాల కోసం ఆలోచన చేశారు. ఈ నేపథ్యంలో మిత్ర ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. జేసిస్ అధ్యక్షుడిగా, రోటరీక్లబ్ అధ్యక్షుడిగా, రోటరాక్ట్ గవర్నర్‌గా, జూబ్లీక్లబ్ సహాయకార్యదర్శిగా, ఛాంబర్ ఆఫ్‌కామర్స్ ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. మిత్ర ఫౌండేషన్ ద్వారా పేద మహిళలకు 400 కుట్టుమిషన్లు, బాలికలకు 500 సైకిళ్లు, 27రక్షిత మంచినీటి ప్లాంట్లు, విద్యార్థులకు లక్ష నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అంతేకాక మెడికల్ క్యాంప్‌లు, స్పోర్ట్స్ మరియూ సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాస తరగతులను పదేళ్లుగా కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ నిర్వహిస్తున్నారు.

వ్యాపారుల్లో ఐక్యత తెస్తా

కురువెళ్ల ప్రవీణ్‌కుమార్

ఛాంబర్‌ఆఫ్ కామర్స్‌లోని వ్యాపారులను ఏకతాటిపై తీసుకొచ్చి అభివృద్ధి చేయటమే ప్రథమ కర్తవ్యం. ఛాంబర్‌లో దశాబ్ధాలుగా ఉన్న సమస్యలను అందరి ఆమోదంతో పరిష్కరిస్తాం. సంఘానికి నూతన భవనం నిర్మించి అన్నివ్యాపార వర్గాలకు అనువుగా ఉండేలా కృషి చేస్తా. వ్యాపారులకు అన్‌సీజన్‌లో ఆదాయం సమకూరేలా కొత్తమార్గాలు అన్వేషించి వ్యాపారులు ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తా.



మంత్రి తుమ్మల నుంచి ఉత్తమ సామాజిక సేవా పురస్కారాన్ని అందుకుంటున్న ప్రవీణ్(ఫైల్)

సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం

ఖమ్మంచర్చికాంపౌండ్,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): దూదేకుల కులస్తుల అభివృద్ధికి ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటామని దూదేకుల సంఘం రాష్ట్రఅధ్యక్షుడు షేక్ బడేసాహెబ్ అన్నారు. శనివారం ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డికా సహారా నిస్కిన్, ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన పథకాలలో దూదేకులను గుర్తించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఈరా, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ అన్వర్‌పాషా, షేక్ మీరాసాహెబ్, షేక్ మౌలాలి పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డికి, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు రుణపడి ఉంటామని తెలంగాణ నూర్ బాషా దూదేకుల ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షుడు సయ్యద్ బాషా పేర్కొన్నారు. శనివారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దూదేకులను గుర్తించి వారికి ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్‌పాషా, సిద్ది బాషా, షేక్ సకీనాబీ, లాల్‌సాహెబ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంఅర్బన్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఖమ్మం నగరంలోని టుటౌన్ సెక్షన్ పరిధిలోని పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నది. వైరారోడ్ ఫీడర్ పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గంట పాటు కరెంట్ ఉండదు. ఎన్ఎస్‌టీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటలనుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నారు. సరితక్లినిక్ సెంటర్, రేవతి సెంటర్, వైరారోడ్, ఎన్ఎస్‌టీ రోడ్డు, నెహ్రూనగర్, బాలాజీ నగర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో నగర ఏడీఈ ఒక ప్రకటనలో కోరారు.

సమస్యలు వెంటనే తీర్చాలి: సీపీఎం

ఖమ్మంఅర్బన్ సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి):ఖమ్మం నగర ప్రజల సమస్యలు వెంటనే తీర్చాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీపీఎం త్రీటౌన్ కమిటీ, శాఖా కార్యదర్శులు సమావేశం శనివారం స్థానిక గుట్టల బజార్‌లోని గుమస్తాల సంఘ భవనంలో జరిగింది. డివిజన్ కార్పొరేటర్ యర్రా గోపి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో మాట్లాడారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బండారు రమేష్, త్రీటౌన్ కార్యదర్శి భుక్యా శ్రీనివాసరావు, పత్తిపాక నాగ సులోచన, యర్రా రంజిత్, ఎస్‌కే ఇమాం, బండారు వీరబాబు, శీలం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పలనర్సింహాపురంలో మెగాప్లాంటేషన్

నేలకొండపల్లి,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని అప్పలనర్సింహాపురంలో శనివారం మెగాప్లాంటేషన్ కార్యక్రమాన్ని మండల అధికారులు ప్రారంభించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని తీసుకున్నారు. తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ మర్రి ఎర్రయ్య తదితరులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగించారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా అప్పలనర్సింహాపురం గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని తీసుకున్నట్లు ఎంపీడీఓ చెప్పారు. అధికారులు, గ్రామస్తులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ శివ, ఏపీఓ సునీత, కార్యదర్శి షేక్. ఇబ్రహీం, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లు పెంచాలని ధర్నా

ఖమ్మంచర్చికాంపౌండ్,సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): వికలాంగుల హక్కులపోరాట సమితి, ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్, సీపీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శనివారం కార్పొరేషన్ కార్యాలయంఎదుట ధర్నానిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆసరా పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నగర పాలక సంస్థ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్యమాదిగ, రేళ్లపుల్లమ్మ, ఉపేందర్,భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల పేరుతో బెదిరింపులా?

ఖమ్మంఅర్బన్ సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు ప్రభుత్వం బకాయి పడ్డ వందల కోట్ల నిధులను విడుదల చేయకపోగా తనిఖీలపేరుతో ఆసుపత్రుల యాజమాన్యాలను బెదిరించే విధంగా ప్రవర్తించటం ప్రభుత్వ నియంతృత్వ చర్య అని సీపీఐ (ఎం ఎల్) మాస్‌లైన్ జిల్లా సెక్రటేరియేట్ సభ్యుడు ఆవుల అశోక్ అన్నారు. శనివారం ఖమ్మంలోని జిల్లా పార్టీ కార్యాలయం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఫీజు రీఎంబర్స్ మెంట్ అడిగినందుకు ప్రైవేటు కళాశాలల పట్ల కూడా ప్రభుత్వం ఇదేవైఖరి అవలంబించిందన్నారు. ఆసుపత్రులను తనిఖీ చేయదలిస్తే పాత బకాయిలు అడిగినప్పుడే ఎందుకు అని ప్రశ్నించారు. సమావేశంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నగర కార్యదర్శి శోభ, సత్తార్, అశోక్, సుజాత, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు

రఘునాథపాలెం, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ప్రభుత్వం ఎప్పడు అధికారంలోకి వచ్చినా గ్రామీణ ప్రాంతాల్లో పూరిళ్లు లేని నివాసాల నిర్మాణం జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు జానబోయిన పాపయ్య, కిషాన్‌సెల్ ఉపాధ్యక్షుడు కోట్టేరు నర్సింరెడ్డి, షేక్ రహీం పేర్కొన్నారు. చిమ్మపూడిలో 70 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావటంతో గ్రామస్థులు, ఎస్సీ కాలనీ నివాసులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు దొంతు వెంకన్న,కోటేరుశశిధర్‌రెడ్డి, తూము సత్యనారాయణ, కన్నం నరేశ్, గుండ్ల గోవర్ధన్, బలుగూరి రవి, మోదుగు ఏసులు, కోటయ్య కన్నం కృష్ణయ్య పాల్గొన్నారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిపారసు మేరకు మంజూరు జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు, జోనబోయిన పాపయ్య, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి
8
ZONE
ఆదివారం 21 సెప్టెంబరు 2025
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY



ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా చర్యలు

ముదిగొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో ఇండ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్ల ద్వారా ప్రమాదాలు సంభవించకుండా కొత్త లైన్లు ఏర్పాటుచేసి చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసాచారి పేర్కొన్నారు. శనివారం పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం నుంచి రూ.9కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. ఇప్పటివరకు 5500విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి సమస్యలు పరిష్కరించామని తెలిపారు. ఖమ్మంజిల్లాలో విద్యుత్ సమస్యతో ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా విద్యుత్ అవసరాలు తీర్చుతూ ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా ఉండాలనే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నట్లు ఆయన అన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

» సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉంటాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కొత్తూరు రైతువేదికలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులతో పోషణమాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అదేవిధంగా గర్భిణులకు సాంప్రదాయబద్ధంగా సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశనలు చేసిన తర్వాత బతుకమ్మల వద్ద ఆడిపాడారు. అంతకముందు స్థానిక శ్రీ బండి శోభనాచలం ప్రభుత్వ బాలుర కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.మట్టా దయానంద్‌తో కలిసి పాల్గొని ఆషా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫామ్‌ను ఉచితంగా అందజేశారు. డీఐఈఓ కే.రవిబాబు, ప్రిన్సిపాల్స్ డా.ఎన్.గోపీ, జీ.లక్ష్మయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ మెహరున్నీసాబేగం, సూపర్‌వైజర్లు గంగాజలం, మహాలక్ష్మీ, కమల, భవానీ, వసంత, రజిని, రమాదేవి, సుజాత, ప్రసాద్ పాల్గొన్నారు.



సత్తుపల్లిలో బతుకమ్మల వద్ద ఆడిపాడుతున్న ఎమ్మెల్యే

కల్లూరులో ముందస్తు బతుకమ్మ సంబురాలు

కల్లూరు: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో శనివారం ముందస్తుగా బతుకమ్మ సంబురాలు జరపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామర్ పాఠశాల, ప్రతిభ, విజ్ఞాన్ విద్యాసంస్థల్లో ఈ వేడుకలు జరుపుకున్నారు. ప్రతిభ విద్యాసంస్థల అధినేతలు లక్కినేని ప్రసాద్, రఘు, పిన్సిపాల్ ఎం శ్రీనివాసరావు, తెలంగాణ గ్రామర్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కె ఇస్మాయిల్, ఉపాధ్మాయునీలు రత్నకుమారి, సప్నరాణి, వరలక్ష్మి, ఉమారాణి పాల్గొన్నారు.

పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు

ముదిగొండ: అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థినులు బతుకమ్మలను తయారుచేసి వాటి చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశారు. ముదిగొండలోని లిటిల్ ఇండియన్ పాఠశాల నందు ఉపాధ్యాయులు, విద్యార్థినులు బతుకమ్మలాడారు.

మధిరరూరల్: మధిర మండలం అత్కూరు శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్లో శనివారం బతుకమ్మలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి సంబురాలను ప్రారంభించారు. కరస్పాండెంట్ బట్టా అంజన్‌బాబు, డైరెక్టర్ సీహెచ్.చందు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

మధిర: మధిరలోని పలు ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులు బతుకమ్మ సంబురాలలో పాల్గొన్నారు. రేపటి నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో ముందస్తుగా పాఠశాలలో బతుకమ్మ ఆడి సంబురాలు నిర్వహించారు. జీవీ అకాడమీ, భరత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్, శ్రీనిధి జూనియర్, డిగ్రీ కళాశాలలో కూడా బతుకమ్మ సంబురాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏన్కూరు: బతుకమ్మ పర్వదినం సందర్భంగా శనివారం బురదరాఘవాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశల హెచ్‌ఎం నాగిరెడ్డి, ఉపాధ్యాయులు సాగి సుజాత, పొట్టా రామారావు, కైలారావుప్, విజయశ్రీ, సులోచన, శ్రీనివాసరావు, పుల్లయ్య, నరేష్, భాస్కర్,నాగేశ్వరరావు, బావ్‌సింగ్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేసేవరకూ పోరాటం

వైరా, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ రెండోవార్డులోని హనుమాన్‌బజార్ శ్మశాన వాటికకు రోడ్డు ఏర్పాటుచేసేందుకు సీపీఎం పోరాడుతుందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రకటించారు. శ్మశాన వాటికకు రహదారి లేక పేద ప్రజలు నరకం అనుభవిస్తున్నారని, పేద కుటుంబంలో మరణం సంభవిస్తే బంధువులు చందాలు వేసుకొని దహన సంస్కారాలు చేయాల్సిన దుస్థితిలో హనుమాన్‌బజార్‌లోని పేదలు బతుకుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సీపీఎం పట్టణశాఖ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ముందు హనుమాన్ బజార్ శ్మశాన వాటికకు బౌండరీలు ఏర్పాటుచేసి శాశ్విత రహదారి నిర్మించాలనే డిమాండ్‌తో అక్కడి ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ యు.గురులింగంకు నున్నా ఆధ్వర్యంలో ఒక వినతిపత్రం సమర్పించారు. ఆతర్వాత ఆయన ప్రసంగించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, నాయకులు సుంకర సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు, ఓర్సు సీతరాములు, గుడిమెట్ల రజిత, మోహన్‌రావు, కొంగర సుధాకర్, వల్లెపు కొండలు, రాము, దేవళ్ల కృష్ణ, బత్తుల ప్రమీల పాల్గొన్నారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించాలి

వైరా, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అత్యంత పకడ్బందీగా ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించాలని వైరా నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాంబాబు సూచించారు. వైరా మునిసిపల్ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌వో, ఆర్పీఎస్, జీపీవోలతో శనివారం నిర్వహించిన రివిజన్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ బూతుస్థాయిలో 2002 ఎస్ఐఆర్ డేటాను 2025డేటాతో సరిపోల్చుకోవాలన్నారు. ఈ ప్రక్రియను ఈనెల 24నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎంపీడీవో సక్రియ, కమిషనర్ యు.గురులింగం, ఎంపీవో రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వన మహోత్సవం

మధిర రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచి ఆకుపచ్చని తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని శనివారం మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ఆవరణంలో ప్రిన్సిపాల్ కె.సాంబయ్య, హెచ్‌వోడీలు సాంబశివరావు, వినోద్‌కుమార్, విజయలక్ష్మిలు మొక్కలు నాటారు. ఇందులో భాగంగా ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు కళాశాల ఆవరణంలో పలు మొక్కలు నాటారు.

భవిష్యత్‌ను ఉజ్వలంగా మలచుకోవాలి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అందివచ్చిన అవకాశాలతో తమ భవిష్యత్‌ను ఉజ్వలంగా మలచుకోవాలని జేవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డా.నంద్రు గోపీ అన్నారు. శనివారం హైదరాబాద్‌కు చెందిన ఏకేఎస్-ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సీనియర్ అధ్యాపకులు డా.ఎంకే.శ్రీనివాస్ విద్యార్థులకు పోటీ పరీక్షలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. కాంపిటీటీవ్ సెల్ కన్వీనర్ డాక్టర్ పద్మరాణి, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌కే.పీర్‌సాహెబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

టెట్‌పై ప్రభుత్వం రిట్ పిటిషన్‌ను దాఖలు చేయాలి

బోనకల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల టెట్ అర్హత పరీక్షకు సంబంధించి ప్రభుత్వం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై వెంటనే రిట్ పిటిషన్ దాఖలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ డిమాండ్ చేశారు. బోనకల్‌లో శనివారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు, డీఏలను విడుదల చేయాలని, కేజీబీవీ, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు రంగారావు, నర్సింహారావు, గోపాలరావు, రామారావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

మధిర,సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ కౌన్సిలర్ మల్లాది వాసు, మాజీ శివాలయం చైర్మన్ పాటిబండ్ల సత్యంబాబు అన్నారు. శనివారం పదో వార్డులో భట్టి ఫొటోతో ఉన్న గోడ గడియారాలను పంపిణీ చేశారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని అన్నారు. కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

'ఓపెన్' కాపీయింగ్‌కు సర్వం సిద్ధం!

(5వ పేజీ తరువాయి)

తెలుస్తోంది. స్టడీసెంటర్లలో ఉన్న తమ అనుచరులతో అభ్యర్థులను పాస్ చేయిస్తామని చెప్పి ప్యాకేజీలు మాట్లాడుకుంటున్న సమాచారం.

పరీక్ష విధులకు ఉపాధ్యాయుల్లో పోటీ..

ఓపెన్ స్కూల్ పరీక్ష విధులు నిర్వహిస్తే సదరు ఉపాధ్యాయుడికి సంపాదిత సెలవులు వస్తాయి. వాటిని విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది. ఒక్క రోజు సెలవు సుమారు రూ.4వేల విలువ ఉంటుండగా, మొత్తం డ్యూటీలు చేస్తే రూ 40వేల జీతం అదనంగా అందనుంది. దీంతో ఉపాధ్యాయులలో పోటి నెలకొంది. సాధారణంగా సీనియార్టీ ప్రకారమే ఇన్విజిలేషన్ విధులు కేటాయిస్తుంటారు. సీఎస్‌లు, డీవోలుగా సీనియారిటీని విస్మరించి ఇష్టానుసారంగా నియామకాలు చేసినట్టు విమర్శలు వస్తున్నాయి. నగరంలో ఉన్న వారిని కాదని దూర ప్రాంతాలకు చెందిన వారిని, మారుమూల పాఠశాలల వారికి విధులు కేటాయించారని తెలుస్తోంది. కాగా ఆయా పాఠశాలల్లో సీనియర్ ఉపాధ్యాయులు ఉన్నా వారిని కాదని జూనియర్ ఉపాధ్యాయులకు ఇన్విజిలేటర్లగా అవకాశం కల్పించడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రేపటి నుంచి 28వరకు పరీక్షలు

తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ 2025 థియరీ పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి 28వరకు జరుగుతాయని ఇన్‌చార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి, జడ్పీ సీఈవో దీక్షారైనా, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ మంగపతిరావు తెలిపారు. ఖమ్మంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదోతరగతి, రిక్కాబజార్ పాఠశాలలో ఇంటర్ పరీక్షలు జరగనుండగా.. మొత్తం 541 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారి, సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించారు.

రేపు ముదిగొండలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన

ముదిగొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలంలో సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు తెలిపారు. ముదిగొండ, మాధాపురం, ఎడవల్లి తదితర గ్రామాల్లోని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు తప్పని యూరియా తిప్పలు

వైరా, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 20వేల ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేసిన వైరా మండలానికి వెంటనే 500మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. వైరా సొసైటీ గోదాముల వద్ద శనివారం యూరియా కోసం తరలివచ్చిన రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సదర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. వరిసాగు నాట్లు కాకుండా అధిక విస్తీర్ణంలో వెదజల్లే పద్ధతి అనుసరించటం వల్ల ఏకకాలంలో యూరియా డిమాండ్ పెరిగిందని తెలిపారు. రైతులు గొల్లపూడి హరినాథ్‌బాబు, కామినేని రవి, బండి గోపాలకృష్ణ, షేక్.సైదులు, అమరేంద్ర, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోనకల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల సహకార సంఘంలో శనివారం యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. ఈ సొసైటీ పరిదిలో ఆళ్లపాడు, రావినూతల రెండు గ్రామాలు ఉండటంతో ఎక్కువ మంది రైతులు యూరియా కోసం వచ్చారు. కాని కేవలం 323 బస్తాలు మాత్రమే రావడంతో అక్కడ ఉన్న 400 మంది రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. దింతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచరం తెలుసుకున్న ఎస్ఐ పొదిలి వెంకన్న సొసైటీ వద్దకు చేరుకొని రైతులను శాంతింపజేశారు. ఏ ప్రతిపాధికన యూరియా ఇస్తారంటూ రైతులు నిలదీశారు. ఒకే కుటుంబంలో 5 ఆదారు కార్డులు ఉంటే వారందరికి ఇస్తారా? లేక భూ విస్తీర్ణం ప్రకారం ఇస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చిన కొద్దిపాటి యూరియాను ఎట్టకేలకు పంపిణీ చేయడంతో అందరికి అందక నిరాశతో వెనుదిరిగారు. తమ అవసరాలకు తగినట్లు యూరియా కొరత లేకుండా పంపిణీ చేయాలని వేడుకున్నారు.

కారేపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రైతులకు పోలీసుల బందోబస్తుతో యూరియా బస్తాలు పంపిణీ చేశారు. శుక్రవారం యూరియా కోసం వేలాదిగా వచ్చిన రైతులు చేసిన ఆందోళనతో సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు, ఏసీపీ తిరుపతిరెడ్డి సమక్షంలో 1477మందికి కూపన్లు పంపిణీ చేశారు. పంపిణీ కేంద్రాలను డీఏవో దనసరి పుల్లయ్య పర్యవేక్షించారు.

పంచాయతీ కార్యాలయాల ముట్టడి



వేంసూరులో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముదిగొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా పింఛన్ల ను పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు సమర్పించారు.

మధిరరూరల్: పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో మధిర మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాలను ముట్టడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్‌మాదిగ మాట్లాడారు. నాయకులు పార్శపు ఏసుక, కొండూరి రాజేష్, మీసపోగు ఇర్మియ, గుమ్మడి రామారావు, ఎస్‌డీ.జహీర్, నాగబాబు, సురేష్, బ్రహ్మం పాల్గొన్నారు.

వేంసూరు: పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శనివారం పలు పంచాయతీ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు బాలస్వామి, రత్నకుమార్, రమణ, మల్లేశ్వరరావు, రాములు, వి.మోహన్‌రావు, ఎం.రమేష్, దివ్యాంగులు పాల్గొన్నారు.

తల్లాడ: ఆసరా పింఛన్ల పెంపకోసం సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామిని అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం తల్లాడ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలను ఆసరా పింఛన్‌దారులు ముట్టడించారు. ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, నాయకుల ఎక్కిరాల నాగేశ్వరరావు, మాగంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

బోనకల్: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామిలలో బాగంగా దివ్యాంగులు, వృద్ధులకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ శనివారం పలు పంచాయతీ కార్యాలయాల ఎదుట ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి కార్యదర్శులకు వినతిపత్రాలను అందజేశారు. ఎంఆర్పీఎస్ నాయకులు చిలకా నాగరాజు, కోట హన్మంతరావు, సాల్మన్ పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను విరమింపజేయాలి

వైరా, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు, దినసరి కార్మికులు పదిరోజులుగా చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం స్పందించి వెంటనే సమ్మెను విరమింపజేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం కోరారు. శనివారం ఆమేరకు వీరభద్రం ఒక ప్రకటన చేశారు. పదిరోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, గిరిజన సంక్షేమశాఖ స్పందించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. గిరిజన సంక్షేమశాఖ అధికారులు వెంటనే చర్చలు జరిపి కార్మికుల డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమ్మె పట్ల తక్షణమే స్పందించకపోతే వైరా నియోజకవర్గంలోని కారేపల్లి, ఏన్కూరు, కొణిజర్ల మండలాల తోపాటు జిల్లావ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో జరుగుతున్న సమ్మెకు మద్దతుగా మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికార పార్టీకి చెందిన గిరిజన ఎమ్మెల్యేలు వెంటనే జోక్యం చేసుకుని సమస్య పరిష్కారానికి కృషిచేయాలని కోరారు.

సీపీఎం వింతపోకడలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ నేత పూర్ణచంద్రరెడ్డిపై సీపీఎం పార్టీ చేస్తున్న ఆరోపణలు, అర్థరహితమని మండల కాంగ్రెస్ కమిటీ పేర్కొంది. మండల కేంద్రంలో గలపార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మదిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కొద్దిరోజులుగా భీమవరం గ్రామంలో ఓ భూవివాదంపై సీపీఎం పార్టీ నాయకులు నవతెలంగాణ పార్టీ పత్రిక సషల్‌మీడియా వేదికగా కాంగ్రెస్ నాయకుడు యరమల పూర్ణచంద్రారెడ్డిపై తప్పుడు కథనాలతో ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. 3 ఎకరాల 10 గుంటల భూమికి 3 ఎకరాల 30గుంటల భూమిని దొడ్డిదారిలో ధరణి రిజిస్ట్రేషన్ చేయించుకుని రికార్డు ప్రకారం భూమి చూపించాలని రెవెన్యూ అధికారులపై వత్తిడి తెస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. సాగర్ కాలవ భూమిని అధికారులను బెదిరిస్తూ సీపీఎం నాయకులు కమ్యూనిస్టు సిద్ధాంతాలను గంగలో కలిపారన్నారు. అన్నిరాజకీయపార్టీలకు కమ్యూనిస్టులపై గౌరవం ఉంటుందని, భీమవరం గ్రామాభివృదబ్ధి కోసం సర్వస్వాన్ని ధారపోస్తున్న కాంగ్రెస్ నేత ప్రతిష్ట దిగజారాలే ప్రవర్తించి గ్రామాభివృద్ధిని అడ్డుకోవద్దని తెలిపారు. నాయకులు అనుమోలు కృష్ణారావు, కంచర్ల వెంకటనరసయ్య, భీమవరం గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, దేవరకొండరాజీవ్‌గాంధీ, శ్రీనివాసరావు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకపోతే నేటి నుంచి విధులు బహిష్కరిస్తాం



పోలీసులకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

వైరా, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమ పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించకపోతే ఆదివారం అర్ధరాత్రి నుంచి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా విధులు బహిష్కరిస్తామని మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల జేఏసీ ప్రకటించింది. ఆమేరకు శనివారం వైరా పోలీసులకు విధుల బహిష్కరణ వినతిపత్రాన్ని అందజేసింది. పెండింగ్ వేతనాల కోసం తాము విధులు బహిష్కరించి ఆందోళన చేసిన సమయంలో మిషన్ భగీరథ సీఈ, ఎస్ఈ, ఎల్అండ్‌టీ మేనేజర్ పోలీసువారి సమక్షంలో ఆగస్టు 26నాటికి ఒక నెల వేతనం వేశారని గుర్తుచేశారు. ఈనెల ఏడు నాటికి రెండునెలల వేతనాలు చెల్లిస్తామని పైన పేర్కొన్న అధికారులు పోలీసుల సమక్షంలో హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు పెండింగ్ వేతనాలు చెల్లించలేదని, ఈ విషయమై గత 20రోజులుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విధి లేని పరిస్థితుల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి జిల్లావ్యాప్తంగా విధులు బహిష్కరిస్తామని జేఏసీ నాయకులు పోలీసులకు ఇచ్చిన వినతిపత్రంలో స్పష్టం చేశారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తే చర్యలు తీసుకుంటాం

ఎర్రుపాలెం, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): మండలంలో అనుమతిలేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తే ఎంతటివారైనా చర్యలు తీసుకుంటామని వ్యక్తిగత, రాజకీయ కక్షలను పార్టీలు అధికారులకు అపాదించొద్దని తహసీల్దార్ మన్నె ఉషాశారద అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో రాజుపాలెం, మామునూరు, తాటిగూడెం పెద్దగోపవరం గ్రామాలలో మైనింగ్‌శాఖ ద్వారా ప్రభుత్వం అనుమతిచ్చిందని తెలిపారు. అనుమతిపొందిన గ్రావెల్ క్వారీల నుంచి ప్రభుత్వ అభివృద్ధి పనలకు మాత్రమే గ్రావెల్ తోలకాలు జరుగుతున్నాయన్నారు. ఎవరైన అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్టు సమాచారమిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని రాజకీయపార్టీలు వ్యక్తిగత, రాజకీయ కక్షల నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా తహీల్దార్ కార్యాలయం కేంద్రంగా నిరసనలు తెలపడం సబబుకాదన్నారు. వ్యక్తిగత, సివిల్, భూతగాదాలు విషయంలో తమ పరిధికి లోబడి మాత్రమే జోక్యం ఉంటుందన్నారు. భీమవరం సర్వేనెంబరు 190లో సర్వేకోసం దరఖాస్తు చేసుకున్న రైతు భూమిసర్వే చేసి హద్దులు నిర్ణయించామని, అక్కడ ఇరిగేషన్ భూమి రైతుల ఆక్రమణలో ఉందని తెలిపారు. భూమి సంబంధిత సివిల్ వివాదాలను ఇరువర్గాలు కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. మండలంలో కేవలం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మాత్రమే ఇసుక కూపన్లు జారీచేశామన్నారు.16క్లస్టర్లకు14మది జీపీవోలు గ్రామాల్లో బాధ్యతలు తీసుకున్నారని తెలిపారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



ఎంపీడీవో కార్యాలయంలో ప్యూరిఫైయిర్‌ను అందిస్తున్న చందర్‌రావు

కల్లూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు విద్యార్థులకు బ్యాగులు, పాఠశాలకు ఆఫీస్ టేబుల్‌ను అందజేశారు. తమ మనమడు పసుమర్తి పద్మవిహాన్ జన్మదిన వేడకల సందర్భంగా 100 మంది విద్యార్థులకు విలువైన బ్యాగులను అందజేశారు. అలాగే మండల పరిషత్ కార్యలయంలో రూ.10 వేల విలువగల వాటర్ ప్యూరిఫైయిర్‌ను అందజేశారు. స్థానికంగా కలలివాడ, శాంతినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో తమ మనుమడు పద్మవిహాన్ జన్మదిన వేడుకలను విద్యార్థుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. దాత చందర్‌రావును ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖుడు దోసపాటి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు కుంచాల గురవయ్య, కనకపూడి జయరాజు, ఉబ్బన రాంబాబు, బొల్లం ఉపేందర్ గౌడ్, కొత్తపల్లి వీరేంద్ర, జీ ప్రవీణ్, కె వెంకట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యాబోధనే మా లక్ష్యం



యువకులను అభినందిస్తున్న యాజమాన్యం

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన విద్యాబోధనే లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు అన్నారు. మండలంలోని కొత్తూరులోని తమ కళాశాలకు చెందిన బీటెక్ ఈసీఈ (2019-2023) విభాగానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రభుత్వ కొలువులు సాధించడం పట్ల శనివారం అభినందిస్తూ ఘనంగా సన్మానించామన్నారు. చెన్నై రైల్వేస్‌లో జూనియర్ ఇంజనీర్‌గా వీఎం.బంజర్ మండలం సోమ్లానాయక్ తండాకు చెందిన కేలోతు బాలాజీ, భద్రమ్మ దంపతుల కుమారుడు ఫణీల్, బెంగళూరులోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బెల్‌లో ప్రోబిషనరీ ఇంజనీర్‌గా కల్లూరు మండలం బత్తులపల్లికి చెందిన బాణోతు బాలాజీ, ద్వాలీ దంపతుల కుమారుడు సాయిరామ్‌లు ఉద్యోగాలు సాధించారు. చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డా.చలసాని హరికృష్ణ, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డా.ఎంవీ.రామచంద్రరావు, ఈసీఈ విభాగాధిపతి డా.ఉదయ్ కిరణ్, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ఇసుక అందించాలి

మధిర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక డిపోలో నాణ్యమైన ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచాలని బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం మధిర మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన శాండ్ బజార్‌ను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక డిపో నుంచి ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల తోపాటు సామాన్య ప్రజలకు కూడా ఇవ్వాలని, బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు శివరాజు సుమంత్, గుండా పాపిరెడ్డి, నాయకులు పెరుమాళ్లపల్లి విజయరాజు, చిలివేరు సాంబ, రమేష్, శ్రీహరి, రామిశెట్టి నాగేశ్వరరావు, కుంచం కృష్ణారావు, సోమేశ్వరరావు, వేణు, శ్రీను, అర్జునరావు పాల్గొన్నారు.

సత్తుపల్లి ఆర్టీసీలో దసరా సందడి

» అదనపు చార్జీలతో జేబులకు చిల్లులు

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలకు నేటి నుంచి సెలవులు ప్రారంభం కావడంతో సత్తుపల్లి ఆర్టీసీలో దసరా సందడి ఏర్పడింది. శని, ఆదివారం రెండు రోజుల్లో విద్యార్థులు తమసొంత ఊళ్లబాట పట్టనున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో సత్తుపల్లి బస్టాండ్‌లో రద్దీగా కనిపించింది. ఈ క్రమంలో వచ్చేనెల 5, 6తేదీల్లో తిరుగు ప్రయాణం దృష్ట్యా రద్దీకి అనుగుణంగా స్పెషల్ బస్సులు నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రత్యేక సర్వీసుల్లో 50శాతం అదనపు చార్జీ అమలుకు సంస్థ నిర్ణయించడంతో ప్రయాణీకుల జేబుకు చిల్లు పడనుంది.

సత్తుపల్లి నుంచి 13అదనపు బస్సులు

ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఈ క్రమంలో ఈనెల 30న బతుకమ్మ, వచ్చేనెల 2న దసరా పండుగలు కావడంతో ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా 13అదనపు సర్వీసులను శనివారం నుంచే ప్రారంభించినట్లు అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ తెలిపారు. అదేవిధంగా బస్సులను హైదరాబాద్‌తో పాటు మిగిలిన రూట్లలో పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని, పండుగల దృష్ట్యా రిజర్వేషన్ చేసుకోవాలనే ప్రయాణీకుల సౌకర్యార్థం రిజర్వేషన్ కౌంటర్లు అందుబాటులో ఉంచామని, టీజీఎస్‌ఆర్టీసీబస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చుని,వివరాలకు 9959225990ను సంప్రదించాలని కోరారు.